# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



సంపుటి 33 సంచిక 4
పేజీలు 48
డిసెంబర్ 2013

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


***ఈ సంచికలో*** ............................. ....... **పేజీ**


| | |
|---|---|
| అమ్మ ఆశీస్సులు............................... | 2 |
| భద్రవాక్యం | 3 |
| యోగి వేమన | 4 |
| శ్రీబాబూజీ ఉవాచ | 5 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 7 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| యోగవాశిష్ఠము | 11 |
| శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు | 13 |
| గురు కృపాహి కేవలమ్ | 14 |
| పరిప్రశ్నేన సేవయా | 16 |
| మోహనరూపా కాళీప్రసాదా! | 17 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 18 |
| సర్వము నీ దయ | 20 |
| బ్రహ్మ కడిగిన పాదము | 22 |
| త్యాగి | 24 |
| రజతోత్సవ వేడుకలు | 27 |
| నివేదిక | 30 |
| శ్రీగురుదేవుల చిద్విలాస లీలలు | 31 |
| హేమంత శ్రీమంతం | 34 |
| శ్రీబాబూజీతో అనుభవాలు | 36 |
| నేను అర్థం చేసుకున్న 'బుద్ధి' | 39 |
| శ్రీగురుదేవుల ప్రణాళిక | 42 |
| సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర | 44 |
| విష్ణు కథలు | 46 |

# అమ్మ ఆశీస్సులు

సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు అయిన సమర్థ సద్గురుదేవుల రజతోత్సవ పుణ్యారాధనామహోత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. శ్రీ సద్గురుదేవులు అందరిలో ప్రకాశిస్తూ, అందరితో యీ కార్యక్రమం జరిపించుకున్నారు.

కాలం ఎవరికోసమూ ఆగదు. కాలాన్ని శాసించే శక్తి 'కాలజ్ఞాన విదగ్రిణి' అయిన మన స్వామికే ఉంది. మనలో ప్రకాశిస్తూ మన నిజ తత్వాన్ని తెలియజేస్తారు.

'పవ్వళించెను ప్రళయాంతమందు ప్రభువు ఆనంద సాగర మందు' ఆనంద సాగరం ఎక్కడ ఉంది? ఎక్కడో లేదు. భక్త హృదయమే ఆ ఆనంద సాగరం. మన హృదయాలలో విరాజిల్లుతున్న బాబును దర్శించాలంటే మనలోని కామక్రోదాథి గుణాలను తొలగించుకోవాలి.

ముత్యపు చిప్ప స్వాతివాన కోసం ఎదురు చూస్తుంది. స్వాతి చినుకు పడగానే ముకుళించుకుని సముద్రపు అట్టడగుకు వెళ్ళి స్వాతి ముత్యంగా మారుస్తుంది. అలాగే మనం శ్రవణం చేసిన మహాత్ముల బోధలను హృదయమనే లాకర్‌లో భద్రపరచుకుని, అనుభవానికి తెచ్చుకోవాలి. వారి ఋణం మనం ఎప్పుడూ తీర్చుకోలేము.

శ్రీగురుదేవులను భక్తులు 'మీ ఋణం ఎలా తీర్చుకోగలం?' అని అడిగితే, "నేను చెప్పింది చేస్తే, నా ఋణం తీర్చుకున్నట్లే" అనేవారు శ్రీ బాబు. మహాత్ముల దివ్యబోధను అనుభవంలోకి తెచ్చుకుంటే, వారి ఋణం తీర్చినవారమవుతాము.

భక్తులు అందించిన అనుభవాలతో, ఆధ్యాత్మిక వ్యాసాలతో డిసెంబర్ సంచికను కూడా 'ప్రత్యేక సంచిక'గా ప్రచురిస్తున్నారు. ఈ నెలలోనే ధనుర్మాస కార్యక్రమాలు కూడా మొదలవుతున్నాయి. గోదాదేవి తిరుప్పావై ప్రవచనం; ఋషుల చరిత్ర ; శ్రీకృష్ణుని బాల్య లీలలను వర్ణించే దశమ స్కంద ప్రవచనాలు; భక్తుల ఆధ్యాత్మిక ప్రవచనాలతో నెలరోజుల పాటు జరిగే యీ కార్యక్రమాలలో పాల్గొని తరింతురుగాక!

సుఖీభవ! సుఖీభవ!!

మీ

అమ్మ

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరాం।
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్॥
(భ.గీ 7అ. 5శ్లో)

ఆత్మానుభూతి మాటలతో, శాస్త్ర విజ్ఞానం ద్వారా లేక భోగ భాగ్యముల ద్వారా పొందేది కాదు. దాన్ని సాధించటానికి మహత్తర పురుష యత్నము, పట్టుదల, త్యాగము, ఇంద్రియ సంయమనం మనోనిగ్రహము అవశ్యము. అంతేకాక ముక్తి ధామము చేరు మార్గములో అనేక పరీక్షలు కూడా ఎదుర్కొనవలసి వస్తుంది. అటువంటి దృఢ చిత్తముగలవాడు కనుకనే మన ప్రతినిధి అర్జునుని ఉద్దేశించి భగవానుడు 'మహాబాహో!' అని సంబోధించటం జరిగిందని భావించాలి.



ముందుగా పంచ భూతములు, మనస్సు, బుద్ధి, అహంకారము మొదలుగా గల జడములైన ప్రకృతి లేక మాయను అపరా ప్రకృతి అని గ్రహించలేని జీవులంతా మాయా ప్రభావానికి లోనై అజ్ఞానాంధకారములో మునిగి ఉండటం తథ్యం. అంతేకాదు యీ అల్పమైన అపరాప్రకృతికి తోడుగా జగత్తునంతా ధరించి జీవనరూపమైన పరాప్రకృతిని కూడా సాధకుడు గుర్తెరగ అవశ్యమని భగవానుడు తెలియజేస్తున్నాడు.

దీనిని ఒక దృష్టాంతము ద్వారా తెలిసికొని సాధకుడు పరాప్రకృతికి ఆత్మ విలక్షణమైనదని గుర్తెరిగి కృతార్థుడౌతాడు. ఒక కుండ నిండుగా జలము ఉందనుకుందాం. ఆ నీటిలో సూర్యుని ప్రతిబింబం గోచరిస్తుంది. ఘటము దేహముగను, నీటిని మనస్సుగను పరిగణించి, సూర్య ప్రతిబింబమును జీవునిగా భావించినట్లయితే అపరాప్రకృతియను ఘటము, జలమునకు మరియు పరాప్రకృతియగు సూర్య ప్రతిబింబానికి సూర్యుడు విలక్షణుడు. అలాగే ఆత్మవస్తువు పరా అపరా ప్రకృతులకు విలక్షణమైనదన్న విషయాన్ని ముముక్షువు గుర్తెరిగిన మరుక్షణం ఆత్మసాక్షాత్కారం పొందటం తథ్యం!

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

నీటిలోని వ్రాఁత నిలువక యున్నట్లు
పాటిజగతిలేదు పరము లేదు
మాటిమాటికెల్ల మాఱును మూర్ఖుండు
విశ్వదాభిరామ ! వినురవేమ!



తాత్పర్యము -

మూర్ఖుడు ఇది మంచి, ఇది చెడ్డ అని ఆలోచింపక మాటి మాటికి మాటలను మార్చుచునే యుండును. నీటిలో వ్రాసిన వ్రాతవలె ఆ మాట నిరుపయోగమైనది.

నీళ్ళుపోసి కడిగి నిత్యము శోధించి
కూడుపెట్టి మీఁదఁ గోకకట్టి
యెన్నిపాట్లొ పడుదు రీదేహమునకయి
విశ్వదాభిరామ ! వినురవేమ!

తాత్పర్యము -

ఈ దేహము నశించునదే అని తెలియక జనులు నీళ్ళు పోసి తోమి, గుడ్డలు కట్టి, తిండి పెట్టి దీనికయి నానా కష్టములు పడుచుందురు. వీరి మూర్ఖత నేమందును?

పరఁగఁ దానొసఁగఁడు పరులు చెప్పిననైన
నియ్యఁజాలక విధినెసగు వాఁడు
పొట్టు తినెడి లండి బువ్వను పెట్టునా?
విశ్వదాభిరామ ! వినురవేమ!

తాత్పర్యము -

మూర్ఖుడు తన యజమానుడు ఈయవలెనని చెప్పినను, తన కక్కరలేని వస్తువునైన ఇతరుల కీయడు. తానే పొట్టు తిను లోభి ఇతరులకు అన్నము పెట్టడు గదా!

# శ్రీ బాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ నాగురించి భక్తులంతా తెలుసుకోవాలను కోవటం సహజం. నా గురించి ప్రశ్నించినపుడు మీరు వారికి ఏమని సమాధానం చెపుతారు? నేను ఒక అవతారపురుషుడననో లేక వీర భోగవసంతరాయలు అనో లేక రామకృష్ణ పరమహంస అవతారమనో లేక మహాత్ముడనో అని మీరు చెపుతారు.



నేను అవతారమూర్తినీకాదు, మహాత్ముడనూ కాను, భక్తుడనూకాను, కేవలం మీ అందరికి దాసాన దాసుడను. నా బాల్య చరిత్ర వింటే మీరంతా దుఃఖిస్తారు. నేను ఎంతో శ్రమించి సాధించిన ఫలాన్ని మీ నోటికి అందిస్తున్నాను. దానిని స్వీకరించడానికి మీకెంతో కష్టంగా ఉంది. నా చిన్నతనంలో నేను ఎన్నో మహత్తులు చేశాను. ఎన్ని చేసినా మానవుల స్వభావం మారదు. మహత్తులు మహాత్ముల ఆధీనంలో వుంటాయి. కాని వాటిని ప్రదర్శించరు. కానీ ఎంతో సాధన చేసి అణిమాది అష్టవిద్యలకు దాసులై పతనం చెంది యోగభ్రష్టులై జన్మిస్తున్నారు.

నా చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన మీకు చెబుతాను. నేను నల్లమలై అరణ్యాలలో తపస్సు చేసుకొనేవాడిని. ఒక నాడు ఉదయం వ్యాహ్యాళికి వెళ్ళినప్పుడు ఒక యోగిపుంగవుని దర్శనం అయ్యింది. ఆయన నన్ను చూడగానే తనకు దగ్గరగా వున్న ఒక మామిడి టెంకను తీసుకొని దూరంగా విసిరారు. ఆ టెంక వెంటనే ఒక మామిడి మొక్కగా అవతరించి క్రమేపి పెద్దదై ఆకులు, కొమ్మలు, రెబ్బలతో మహావృక్షమై, మామిడి ఫలములతో విరాజిల్లుతోంది. ఆ దృశ్యాన్ని చూడగానే నాకు నవ్వు వచ్చింది. నేను వెంటనే ఆ యోగిపుంగవునికి నమస్కరించి, ఇటువంటి మహత్తులు మానవుని జీవిత పరమార్థాన్ని తెలుసుకోవడానికి గాని, మోక్ష స్థితి అనుభవించడానికి గాని వుపకరిస్తాయా అని ప్రశ్నించాను. ఆయన నవ్వుకొన్నారు. ఇటువంటి

మహాత్తులకు నేను దూరంగా వుంటాను. అనిన వెంటనే యోగి పుంగవుడు సృష్టించిన మామిడి వృక్షం అదృశ్యమయ్యింది. అని చెప్పారు శ్రీ బాబూజీ మహరాజ్. చూశారా సృష్టించబడింది ఏదైనా లయం అవ్వవలసిందే కదా! అందువలన మహత్తులన్నీ అశాశ్వతమైనవి పరిణామముతో కూడినవేగా! కాబట్టి ఇటువంటి వాటికి లొంగిపోక అసలు పొందవలసినది ఏదో దానిని సాధించడానికి మీరు ప్రయత్నించాలి.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ ఎవరైనా నా గురించి ప్రశ్నించినప్పుడు ముందు "నీవెవరవు" అని ప్రశ్నించుకొని దానికి తగిన సమాధానం దొరికితే "నేనెవరో" తెలుస్తుంది. అని చెప్పటం తగిన విధంగా ఉంటుంది. నీవు ఎవరవు? నీవు ఆత్మస్వరూపుడవేకదా! ఆత్మ అంటే నేను అని అర్థం ఆత్మ అనేది ఏది? అది ఇంద్రియమా, లేక మనస్సా? పోనీ అది ఇంద్రియాలకి, మనస్సుకీ, బుద్ధికీ, గుణాలకీ అందేదికాదుగా! కాని వీటన్నింటికి ఆధారమయినది నువ్వు. ఇంద్రియాలద్వారా, మనస్సు ద్వారా పొందే ఆనందమునకు గాని, దుఃఖమునకు గాని ఆధారము ఏది? అదే చైతన్యము లేక ఆత్మ వస్తువు. అది ఒక ఉపాధికి పరిమితమైతే, జీవాత్మగా పిలవబడుతుంది. ఉపాధి తొలగిపోతే పరమాత్మగా భావించబడుతుంది. జీవాత్మ, పరమాత్మకి భిన్నంగా వుందా? "నేనెవరు" అని ప్రశ్న వేసుకొన్నప్పుడు, "నేను" అని భావింపబడేదే ఆత్మ లేక చైతన్యము, కాని అది అహంకారంతో గుణములతో మనస్సుతో కూడిన నేను మాత్రంకాదు" అని అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్.

ఆకలిగొన్నవాడు అన్నానికి అధికారి; దప్పిక గలవాడు నీళ్లకు అధికారి; గుణ శీలాదులు గలవాడే కన్యను పొందే అధికారి. అలాగే ముముక్షువే వేదాంతశాస్త్రానికీ, భగవద్గీతకూ అధికారి.

– శ్రీ రామకృష్ణానంద స్వామి

# శ్రీ మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి)

–జపమాలా ప్రసాద

మన హృదయంలోనే వున్న పరమాత్మ వస్తువుని తెలుసుకోవాలంటే:

జపములేల ? తపములేల ? సాధన సంపదలేల ?
సతతము నను మది నిలిపిన చాలును పొమ్మన్నది
చెప్పుడు మాటలను విని చెడిపోకు మన్నది
ఎప్పటికీ నేనే నీ ఏడుగడనటన్నది
తప్పదు నిజమన్నది - గురుపాదసన్నిధి.



భగవంతుడు గణనాతీతుడు, ఆయన లెక్కలకి అందేవాడు కాదు. అందుకే శ్రీగురుదేవులు, 'కొలికిపూస ఎప్పుడు వస్తుందా' అని ఎదురు చూసే జపాలకీ, 'హమ్మయ్య! నా లక్షజపం పూర్తయింది' అని అనేవారికి పరమాత్మ అందేవాడు కాడు, అని చెప్పేవారు. మనసు నిలిపి చేసినదే నిజమైన జపం. మనసు నిలబడితే జపమాల ఆగిపోతుంది, పెదాలు కదలవు. అది నిద్రకాకూడదు. నిరంతరము లక్ష్యమునందు మనస్సు నిలపడం ప్రధానంగానీ, ఎన్ని లక్షల జపం పూర్తిచేశామని కాదు. అటువంటి జపానికి పరమాత్మ అందుతాడు. "మీ మనస్సనందు భగవత్ పాదారవిందములు నిలిచినా, భగవచ్చరణారవిందముల యందు మీ మనస్సు నిలిచినా ఇక జపతపము లేల?" అనేవారు శ్రీ గురుదేవులు.

జపములేల? తపములేల? సాధన సంపదలేల? అన్నారని, అవన్నీ వదిలేయమని తప్పుడర్థం తీసుకోకూడదు. ఆ తరువాత వాక్యాన్ని జాగ్రత్తగా గమనించాలి.

"సతతము నను మది నిలిపిన చాలును పొమ్మన్నది." ఎల్ల వేళలా తన మదిలో భగవంతుడున్నాడు అనే ఎరుక కలిగివున్న వారికి వేరే జపతపాదులేల అన్నారుగాని, వాటిని మానేయమని కాదు. మనస్సు (నిష్ఠ) భగవంతుని మీద నిలపకుండా ఎన్ని జపాదులు చేసినా అది వృధా అన్నారు. గీతాచార్యుడు భగవద్గీతలో చెప్పినది కూడా అదే.

"సర్వేంద్రియాణి సంయమ్య యఆస్తే మనసా స్మరన్
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిధ్యాచారస్స ఉచ్యతే ॥
యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేర్జున
కర్మేంద్రియైః కర్మ యోగమ్ అసక్త స్సవిశిష్యతే ॥

-ఇంద్రియాలన్నింటినీ కట్టబెట్టి ఒక చోట కూర్చోబెట్టినా, ఎవరి మనస్సయితే ఇంద్రియార్థాల గురించి ఆలోచిస్తూ ఉంటుందో అటువంటి వాడు మిధ్యాచారుడని చెప్పబడుతున్నాడు.

-ఎవరయితే మనస్సుతో సర్వేంద్రియాలని నియమించి, కర్మేంద్రియాలను మటుకు కర్మ చేయడానికి వినియోగిస్తాడో, అతడు అసక్తుడని చెప్పబడతాడు.

ఈవిధంగా, తన లక్ష్యార్థ సాధనలో వున్న సాధకుడు చెప్పుడు మాటలను విని చెడి పోకూడదని చెపుతున్నది గురుపాదం. చెప్పుడు మాటలంటే, బయట నుండి ఎవరో వచ్చి చెప్పేవి కావు. బయట వారు చెప్పేమాటలని మన మనస్సు స్వీకరిస్తోంది కనుక, మన మలిన మనస్సే మనం చెడిపోవడానికి కారణం అవుతున్నది. అందుకని మనసు చెప్పే చెప్పుడు మాటలు విని చెడిపోకురా అని హెచ్చరిక చేస్తున్న గురుపాదమే, 'ఎప్పటికీ నేనే నీ ఏడుగడని అన్న సత్యం మరువ వద్దు సుమా !' అని అభయం కూడా ఇస్తున్నది. ఆ గురుపాదమే మనకి ఊతం ఇచ్చే ఏడుగడ, మనని ఏలే 'ఏలుగడ' కూడా, కనుక దానిని ఎప్పుడూ మరువ కూడదు. ఆ గురుపాదాన్ని మరచిన క్షణం మరణమే.

గురుదేవులు ప్రసాదించిన లక్ష్యార్థసాధన చేసే సమయంలో సాధకుడైన వాడు అనేక పరీక్షలను ఎదుర్కోవలసి వస్తుంది. కానీ, నిజమైన సాధకుడు (భక్తుడు) ఎటువంటి పరీక్షలకీ చలించడు. "కుల శైలములు పెల్లగిలి వచ్చి పైబడినా జలరాశులే పొంగి ప్రళయమే కలిగినా చలియించని భక్తునికే కలదు స్థానమన్నది. కలయైన ఇలను గూర్చి కలవరపడకన్నది. నను విడువకు మన్నది" గురుపాదం.

"కులశైలంబులు పాదు పెల్లగిలి
దిక్కులంబునన్ గూలినం
జలధుల్మే రలతి క్రమించి
సముదంచద్భంగిన్ ఉప్పొంగినన్
జలజాతప్రియ శీతభానులు
యధా సంచారముల్దప్పినన్
దలకండుబ్బడు చొప్పుదప్పడు
భవద్భక్తుండు సర్వేశ్వరా !"

అని మన గురుదేవులెప్పుడూ సర్వేశ్వర శతకంలోని పద్యం పాడుతూ ఉండేవారు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

4.7.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "మనస్సును మించిన శత్రువు, ఇంద్రియాలకి మించిన ద్రోహి లేడు. భగవంతుణ్ణి సేవించటానికి మనస్సు అనే ఆవరణ అడ్డుపడుతుంది.



భగవంతుని కృప పొందాలి అంటే గాఢమైన విశ్వాసం ఉండాలి. అదే భక్తి. దానికి సహాయంగా సాధించాలి! అనే పట్టుదల ఉండాలి. అదే వైరాగ్యం. కాని మానవుడు తన శక్తినంతా ప్రాపంచిక వ్యవహారాలకే వినియోగిస్తాడు. పొలం తగాయిదా కోసం కోర్టుచుట్టూ తిరిగి వేలకు వేలు ధనాన్ని వెచ్చించి, చివరికి పట్టరాని వాళ్ళ కాళ్ళు పట్టుకుని చివరికి సాధించేది ఏముంది? కోర్టులో కేసు గెలిచినవాడు పొలం గెలిచినా దానికి మించి ఖర్చయిందని ఏడుస్తాడు. కేసు ఓడినవాడు పొలం పోయిందని ఏడుస్తాడు. ఇంట్లో ఏడ్చేవాడొకడైతే బయట ఏడ్చేవాడింకొకడు.

హరినామ దృష్టి లేకపోవటం వలననే ఇటువంటి సంకటముల నుండి ఎంత ఐశ్వర్యమున్నా రక్షణ ఉండదు. అటువంటి రక్షణ పొందవలెనంటే ఆచార్యుని సేవద్వారా లభిస్తుంది" అని అన్నారు.

ఇంకా మాట్లాడుతూ "మనస్సు, ఇంద్రియముల శతృత్వాన్ని హరింపజేసేదే తారక నామం. ధ్యానాగ్నిలో దగ్ధమైన మనస్సు శుద్ధమవుతుంది. పిడకని దగ్ధం చేస్తే తెల్లని శుద్ధమైన విభూతి వస్తుంది. ఇది అగ్ని ద్వారా సాధ్యపడుతుంది. అలాగే ధ్యానాగ్ని ద్వారా శుద్ధమైన మనస్సు తిరిగి అశుద్ధమవదు. గృహస్థుడైనంత మాత్రాన దిగులు చెందనవసరం లేదు. సంసారంలో ఉండి స్వధర్మాన్ని ఆచరిస్తూ ఫలితాన్ని ఆశించకుండా మనస్సు భగవంతుని యందు లగ్నం చేస్తే చాలు. అలా కాకుండా తన స్వధర్మాన్ని మాని ముక్కు మూసుకుని ధ్యానం చేయటం సోమరితనం. నీకు ధ్యానం చేయటానికి వీలులేకపోతే భగవంతుడు

ఉన్నాడనే విశ్వాసాన్ని పెంపొందించుకో. అప్పుడు నీవు ఏ పని చేస్తున్నా భగవన్నామాన్ని మరువగలవా? ఆ నామం రక్షా కవచమై నిన్ను కాపాడుతుంది. నీలో ఉండే ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనములను నీవు జయించలేవు. భగవంతుని యందు విశ్వాసం పెరిగిన కొలదీ అవి అదృశ్యమవుతాయి. మీకొక దృష్టాంతం చెపుతాను.

ఒక సోమరి ఉదయం 8గం॥లకు  నిదుర లేచి సిగరెట్టు కాలుస్తూ గ్రామసింహం వలె తిరుగుతాడు. వాడికి పని చేతకాదు. పని చేతకాని వాడికి కోపం ఎక్కువ. అటువంటి వాడి పొలంలో పంట పండమంటే ఎలా పండుతుంది చెప్పండి? సోమరితనమే అజ్ఞానమని, స్వార్థమే మూర్ఖత్వమనీ వేదాల్లో చెప్పబడి ఉంది. ఒక గృహంలో ఒక సోమరి ఉన్నాడంటే అది అంటు తామరలాగా వ్యాపించి ఆ గృహమంతా సోమరితనము, అశాంతి, దుఃఖములు తాండవిస్తూ ఉంటాయి.

పరమాత్ముడు ఆప్తబాంధవుడు. ఆయన రక్షణ ఎలా ఉంటుందో ఒక దృష్టాంతం చెపుతాను. మన భక్తుల్లో ఒకరు హొటల్లో జ్వరం వచ్చి బాధపడుతుంటే ఆ హొటల్లోనే బసచేసి ఉన్న మరియొక వ్యక్తి తనకి పరిచయం లేనప్పటికి ఎంతో సహాయాన్ని అందజేశాడు. తోటి మానవుని రూపంలో సహాయపడిన ఆ అజ్ఞాత వ్యక్తి ఎవరు?

దీనిని అర్థం చేసుకుంటే చాలు. నమ్ముకున్నవారికి బంగారు పిచ్చుక. భగవంతుని యందు విశ్వాసం బొమ్మరాయి లాగా ఉండాలి. బొమ్మరాయి చూడండి, సముద్రంలో వేసిన తరువాత కల్పాంతం వరకైనా చెక్కు చెదరదు. అప్పుడైనా దానినుండి అగ్ని పుడుతుంది. కాని మట్టిరాయి మాత్రం సముద్రంలో వేసిన వెంటనే కరిగిపోతుంది. కాబట్టి మీ విశ్వాసం మెత్తపడిందంటే అది మీ పతనానికి దారి తీస్తుంది" అన్నారు.

'పండా' అంటే తత్వ నిర్ణయ బుద్ధి అని అర్థం.
అది కలవాడే నిజమైన పండితుడు.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) -సుషుమ్న ప్రసాద

"ఓ కర్కటీ! నీప్రశ్నలన్నింటికీ, అనేక రూపాలలో గోచరించే బ్రహ్మమే కేంద్ర బిందువు. కాని పరబ్రహ్మ అద్వితీయము, అవిభాజ్యము, అపారము, సర్వవ్యాపకము, స్వయంప్రకాశమైనది. జీవన్ముక్తులు, పరమహంస స్వరూపులు, పరబ్రహ్మమును త్రికాలాతీతమైన సత్యముగ గుర్తిస్తారు. పరబ్రహ్మ మొక్కటే సత్యము, నిత్యము. పరబ్రహ్మ జగత్తు లయమైన తరువాత కూడ ఉంటుంది. సంకల్ప వికల్ప రహితమైన శుద్ధ మనసుతో ఆత్మ సాక్షాత్కారమును పొందాలి. దీనిని అపరోక్ష బ్రహ్మజ్ఞాన మంటారు. శాస్త్ర పరిశీలన, శాస్త్ర జ్ఞానము చేత పరోక్ష బ్రహ్మ జ్ఞానము లభిస్తుంది."



కర్కటి రాజుగారిచ్చిన తెలివైన సమాధానాలతో, యెంతో సంతృప్తి చెంది, యిలా అన్నది. "మీరు, మీమంత్రి నిజమైన ముని పుంగవులు. మీరు ప్రపంచము చేత సత్కరింప బడవలసిన మహనీయులు. మీరిరువురూ జ్ఞాన సూర్యులవలె ప్రకాశిస్తారు. జ్ఞానముతోకూడిన మీసంభాషణ నాకు అమృతతుల్యముగా ఉన్నది. ఇప్పుడు నా శరీరము చల్లగా, ప్రశాంతముగా ఉన్నది. ఎవరైతే మహాత్ములతో సంపర్కము పెట్టుకొంటారో వారు ధన్యజీవులు. మానవాళి అంతా, మీపవిత్ర చరణములను వారి శిరస్సుపై ధరించాలి. ఓరాజా! నేను మీకేరకంగా సేవ చేయగలనో, ఆజ్ఞాపించండి" అన్నది.

రాజుగారు ఇలా చెప్పారు" ఓకర్కటీ! భవిష్యత్తులో మానవులను నీ ఆహారము కొరకై. సంహరించవద్దు. ఎవరినీ గాయపరచి, హింస పెట్టవద్దు."

కర్కటి వెంటనే "ప్రభూ, మీకు నేను సత్యము చెప్తున్నాను ఇకపై నేనెవరినీ చంపను."

అప్పుడు రాజుగారిలా అన్నాడు. " ఓ కర్కటీ! నీవు జంతు మాంసము భుజించి జీవించే దానివి కదా, మాంసాహారమును విసర్జించి, నీ శరీరపోషణ యెలా చేసుకోగలవు ?

కర్కటి యిలా చెప్పింది. "నేను మరల పర్వత శిఖరానికి వెళ్ళి, తపస్సు చేసి, చాలా కాలము నిర్వికల్పసమాధిలో ఉంటాను. తపో ప్రభావముతో నాలో ఉండే అమృతాన్ని పానము చేస్తాను. చివరకు ఈ శరీరాన్ని త్యజించి, విదేహ ముక్తిని పొందుతాను. ఇక నుండి నా జీవితాంతము, ప్రాణముతో ఉన్న యే జీవిని కూడ హింసించను, గాయ పరచను. నామాటలను విశ్వసించండి."

అప్పుడు రాజుగారు యిలా అన్నారు. "ఓ కర్కటీ! నీవు మాతో పాటు, రాజ ప్రాసాదమునకు వచ్చి మాతో ఉండవలసినది. అక్కడ ఘోరమైన నేరాలు చేసిన దొంగలు, క్రూరులు చాలామంది ఉన్నారు. వారి దేహాలను, ఆహారంగా తీసుకొని, నీ జఠరాగ్నిని వుపసంహరించు కొని, తపస్సు చేసుకొనవచ్చు.

కర్కటి రాజాజ్ఞను శిరసావహించి, కామరూపి కనుక కోమలమైన, సుందరమైన, లక్ష్మీరూపాన్ని ధరించి. రాజుగారి వెంట, వారి స్వర్ణసౌధానికి వెళ్ళింది. రాజుగారు ఆరురోజుల్లో మూడువేల మంది క్రూరులను రప్పించి, కర్కటికి ఆహారంగా సమర్పించారు. కర్కటి తిరిగి రక్కసిరూపాన్ని ధరించి, వారందరిని ఆహారంగా స్వీకరించింది. ఆమె తరువాత రాజుగారి, మంత్రి గారి అనుజ్ఞ తీసుకొని, హిమాలయాలకు తిరిగి వెళ్ళింది. అక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకొని, మరల సమాధిస్థితిలో లీనమయింది.

ఆ సమాధి స్థితిలో ఆరు లేక ఏడు సంవత్సరాలు ఉండి, తిరిగి రాజుగారి వద్దకు వచ్చి, కొంత కాలము రాజుగారితో, మంత్రిగారితో సత్సంగములో గడిపేది. అక్కడ మరల ఆహారమును స్వీకరించి, తపస్సుకు తిరిగి హిమాలయాలకు వెళ్ళేది. ఇలా చిరకాలము రాజుగారితో మైత్రి, సద్గోష్టితో గడిపేది. ఇలా వశిష్ఠ మహర్షి కర్కటి కథను శ్రీరామచంద్రునకు వివరించారు.

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

డిసెంబర్ 2013

01 ఆది మాస శివరాత్రి. శ్రీసద్గురుదేవులు మహాసమాధిలో ప్రవేశించిన రోజు (తిథుల ప్రకారం) శ్రీ సద్గురుదేవుల పాద పూజ.

03 మంగళ శ్రీసద్గురుదేవులు స్వస్వరూపలయం పొందిన తేది. శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

07 శని శ్రీసద్గురుదేవులు మహాసమాధిలో ప్రవేశించిన తేది. శ్రీసద్గురు పాదపూజ

08 ఆది శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి, స్వామికి అభిషేకము, సహస్రనామార్చన

13 శుక్ర గీతాజయంతి, గీతాపారాయణ, సద్గురు పాదపూజ, సత్సంగ సమావేశము.

16 సోమ ధనుర్మాసకార్యక్రమాలు ప్రారంభం.

ఉదయం 9-30ని॥లకు సంకీర్తన, 10గం.లకు తిరుప్పావై, 10-30ని॥ ఋషుల చరిత్ర, 11గం.లకు భాగవత ప్రవచనము, సత్సంగము, తీర్థ ప్రసాద వితరణ.

17 మంగళ పూర్ణిమ. దత్తాత్రేయ జయంతి. శ్రీసద్గురుపాదపూజ.

25 బుధ క్రిస్మస్ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము.

27 శుక్ర శ్రీగురుదశమి. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగసమావేశము.

31 మంగళ మాసశివరాత్రి.

జనవరి 2014

01 బుధ ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము. భక్తసమారాధన.

11 శని ముక్కోటి ఏకాదశి. శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన.

13 సోమ భోగి. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగసమావేశము, భక్తసమారాధన. రాత్రి 8గం.లకు శ్రీబాబుకు భోగిపళ్ళు పోయటం.

14 మంగళ సంక్రాంతి. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగసమావేశము, భక్తసమారాధన.

15 బుధ పూర్ణిమ. కనుమ. శ్రీసద్గురుపాదపూజ.

21 మంగళ శ్రీత్యాగరాజస్వామి ఆరాధన

26 ఆది శ్రీగురుదశమి. సత్సంగ సమావేశము, శ్రీసద్గురుపాదపూజ.

29 బుధ మాసశివరాత్రి.

# గురు కృపాహి కేవలమ్

– రమణ ప్రసాద్

కుమారస్వామి అనే భక్తుడికి చెవులు దిబ్బడవేసి చెముడు వచ్చింది. స్కానింగ్‌లో ఆయన చెవులలో ఉన్న నరాలన్నీ పూడుకుపోయినట్లు తెలిసింది. ప్రస్తుతం చెవులవరకే ఉన్న వ్యాధిపైకి ప్రాకి మెదడుకు వ్యాపిస్తే మరణం తధ్యం. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి అన్నారు డాక్టర్లు. అమ్మకు చెప్పి ఆపరేషన్ చేయించుకుందామనుకున్నాడు కుమారస్వామి.

"అయితే ఆపరేషన్ చేయించుకోక తప్పదంటావు" అన్నారు శ్రీమాతాజీ.

"తప్పదంటున్నారు డాక్టర్లు" అన్నాడు కుమారస్వామి.

"ఆపరేషన్ చేస్తే తగ్గిపోతుంది అని హామీ ఇస్తారా డాక్టర్లు? అని అడిగారు మాతాజీ.

"అలా ఎవరు చెబుతారమ్మా. మా ప్రయత్నం మేము చేస్తాం ఆపైన భగవంతుడి దయ అంటారు" అన్నాడు కుమారస్వామి.

"అయితే భగవంతుడికే వదిలెయ్యి" అన్నారు మాతాజీ.

"వదిలేస్తే ప్రమాదం తప్పదంటున్నారే" అన్నాడు కుమారస్వామి.

"అయితే డాక్టర్ల దగ్గరకు వెళ్ళి హామీ అడుగు" అన్నారు మాతాజీ.

"వాళ్ళు హామీ ఇస్తారని నేను అనుకోను" అన్నాడు కుమారస్వామి.

"కాదు అడిగిరా!" అన్నారు మాతాజీ.

డాక్టర్లను హామీ ఇవ్వమని అడగటానికి సాహసం చేయలేకపోయాడు కుమారస్వామి. అమ్మ అంగీకరించలేదు. కనుక ఆపరేషన్ చేయించుకోలేదు. ఆపరేషన్ లేకుండా సంవత్సరంపైన గడిచిపోయింది.

ఒకసారి మహానందిలోని స్వచ్ఛమైన నీటికుండీ వద్ద ఎత్తైన గట్టుమీద శ్రీమాతాజీ భక్తులతో కూర్చొని ఉన్నారు. వారిలో కుమారస్వామి, అతని స్నేహితుడు మునగాల ప్రసాద్ ఉన్నారు.

"మీ ఇద్దరూ ఆ గట్టుమీద నుంచి దూకండి" అన్నారు మాతాజీ.

'లోతు తక్కువగా ఉంది. దూకితే తలకు దెబ్బ తగులుతుందేమో?' అన్నాడు అక్కడ ఉన్నవారిలో ఒక భక్తుడు.

"ఏటవాలుగా దూకితే ఏ ప్రమాదమూ ఉండదు" అన్నారు మాతాజీ.

అమ్మమాటలు విన్న మరుక్షణం మిత్రులిద్దరూ నీళ్ళలోకి దూకారు. కుమారస్వామికి అలా దూకటంతో పొట్టమీద బలమైన దెబ్బ తగిలినట్లుయి ఊపిరి ఆడలేదు. నోట్లోనుండి, ముక్కులోనుండి చిక్కని శ్లేష్మంలాంటి పదార్థం పెద్ద ఉండగా బయటకు వచ్చి నీళ్ళలో పడింది. ఏమవుతుందో అని భయపడ్డాడు కుమారస్వామి.

తల తుడుచుకుంటుంటే కుమారస్వామికి ఒక విచిత్ర అనుభవం కలిగింది. తనకు అన్ని శబ్దాలూ వినిపిస్తున్నాయి. అంటే తనకు ఆపరేషన్ లేకుండా తన చెవులకు అడ్డుపడిన పదార్థం తొలగి తన వ్యాధి నయం అయిందన్నమాట. కుమారస్వామి సంతోషానికి మేర లేదు.

డాక్టర్లు హామీ ఇవ్వలేదుగానీ బాబూజీ ఎందుకు ఇవ్వలేరు? బాబూజీయే మాతాజీ కనుక తనకు ఆపరేషన్ లేకుండా రక్షించారు" అని భక్తితో అంటాడు కుమారస్వామి.

ఈ సంఘటన బట్టి చూస్తే శ్రీబాబు ప్రతిరూపమే శ్రీ మాతాజీ వారని, అనే సర్వజ్ఞత్వ సర్వ శక్తిమత్వాదులతో ఇప్పుడు ఇలా భక్తులను రక్షిస్తూ, ఏడుగడగా ఉన్నారని అవగతమవుతుంది. అయితే అమ్మ "నేను కేవలం దాసురాలను. నా ద్వారా ఏమి జరిగినా అది బాబు జరిపించిందే" అంటారు.

"గడచిన మార్గశిర శుద్ధ ఏకాదశినాడు నీవు ఏ ఊళ్ళో ఉన్నావో చెప్పు?"

"ఏమో స్వామీ! నాకు జ్ఞాపకం లేదు?"

"నాకు జ్ఞాపకం లేదన్నావేకానీ, నేను లేననలేదే? నీవేమో ఉన్నావు. కాని నీకు జ్ఞాపకం లేదు. దేహాంతర విషయాలు అంతే. నీవు ఉన్నావు. అవి జ్ఞాపకం లేవు"

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

సాధన కొనసాగించే శిష్యులు తాము ఏ స్థితిలో ఉన్నామని ప్రశ్నించినవారికి సమాధానంగా సద్గురుదేవులు బోధ చేస్తూ, "సాధన కొనసాగించటమే ధ్యేయం. అంతేకాని 'మేము ఆత్మానుభూతిని పొందలేక పోయామనో, లేక మేము మోక్షాన్ని పొందగలుగుతామా' అనో సందేహించ నవసరంలేదు.



సద్గురుమూర్తిని ఆశ్రయించి లక్ష్యార్థ సాధనచేసే సాధకులు తమ లక్ష్యమును పొందక పూర్వమే దేహము త్యజించ వలసి వచ్చిననూ వారికి దుర్గతి ఎన్నడూ కలగదు. సత్కార్యము చేసిన వారు కూడా ఎన్నడూ దుర్గతి పొందరు. పుణ్యకార్యము ఆచరించినవారే ఉత్తమగతిని పొందినప్పుడు, సద్గురుమూర్తి పర్యవేక్షణలో లక్ష్యార్థ సాధన చేసిన వారు యోగభ్రష్టులై ననూ సదాచార కుటుంబమందు జన్మించి, తానిదివరలో విడిచిపెట్టిన సాధన మరల కొనసాగించి జన్మరాహిత్యం పొందుట తథ్యం.

ఏ సాధకుడైనా తాను చేసిన సాధన ఎన్నడూ వృథా కాదు. తాను కొనసాగించే ప్రయాణములో అంతరాయము కలిగినను మరుసటి జన్మలో తప్పక గమ్యాన్ని చేరగలుగుతాడు. మోక్షఫలాన్ని అందుకోవటానికి ప్రయత్నించే ప్రతిసాధకుడు ప్రయత్నం ప్రారంభించటం తన వంతుగాని, ఆ ప్రయత్నం కొనసాగించటానికి, దైవ ధ్యానం చేయటానికి ఏమాత్రమూ ఆటంకం లేకుండా దారిద్ర్యము, దురాచారములు లేని యింట జన్మించి, దైవమార్గమున సాధన కొనసాగించటానికి అవ్యాజ కరుణామూర్తియైన భగవానుడు తోడ్పడటాన్ని గుర్తించినవారు ఎంతమంది?

ఈ విషయాన్ని ఆత్మ సంయమయోగంలో అర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నిస్తూ 'శ్రద్ధతో సాధన చేస్తున్నా, మనోనిగ్రహం లోపించి, యోగభ్రష్టుడు అయినవాని గతియేమిటి? వాడు ఇహపరములు రెంటికి చెడి పతనం చెందుతాడా?' అన్న ప్రశ్నకు శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానం సద్గురు దేవులు చెప్పినట్లుగానే ఉండటం గమనించదగినది. సద్గురుమూర్తిని ఆశ్రయించి, లక్ష్యార్థ సాధన చేసే సాధకులకు ఇహమునందు పరము నందు ఎన్నడూ లోటుండదు అన్న విషయం సాధకులంతా గమనించ గలరు!

# మోహనరూపా కాళీప్రసాదా!

-పెనుమాక నాగేశ్వర రావు

ఓహెూ! మోహనరూపా కాళీప్రసాదా!
ఊహాతీతము మీప్రేమా కాళీప్రసాదా ॥ ఓహెూ॥

ఆహా ... హా ... హా...హాయనిపించే మీ దర్శనమూ
ఆపాత మధురం మీ అభిభాషణం ॥ ఆహా॥

అజరా మరమే మీ అభయం
అనితర సాధ్యం మీ ఆదరణం ॥ఆహా॥

స్వష్ట మైనది, స్వచ్ఛమైనది మీ మనసు
సత్యమైనది, నిత్యమైనది మీ ఆశీస్సు ॥స్వష్ట॥

ఉన్నతమైనది, ఉజ్వలమైనది మీ యశము
ఉత్తగ వుండని మా మనసులు మీకే వశము ॥ఓహెూ॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

గత సంచిక తరువాయి

– సుశీలా ప్రసాద

30శ్లో॥ నిబద్ధ ముగ్ధా ఞ్జ విరేష యాచే
నీరన్ధ్ర దైన్యోన్నత ముక్తకణ్ఠమ్
దయామ్బుధే దేవ భవత్కటాక్ష దాక్షిణ్య వేశేన సకృన్ని షి ఞ్చ ॥

తా॥ దయాసముద్రుడవైన ఓ కృష్ణా! నేను చేతులు జోడించి బీదతనముచే గొంతెత్తి పెద్దగా నరచి అడుగుతున్నాను. నీకడగంటి చూపులందలి కరుణావేశము చేత ఒకసారి నన్ను తడుపుము.



చలికి వణుకుతూ చేతులు కాళ్ళు దగ్గిరగా ముడుచుకుని కూచుని ఉన్నాడు సింగన్న. వీపు మీద కప్పుకున్న బట్ట చలికి ఆపటంలేదు. కుక్కి మంచంలో కళ్ళు మూసుకుని పడుకుని ఉంది అతని భార్య చుక్కమ్మ. బైట జోరుగా వాన కురుస్తోంది. ఈ వాన తగ్గిందాకా తమ బతుకు విల విల్లాడాల్సిందే. దుఃఖం ముంచు కొచ్చింది సింగన్నకి. ఈపాటికి తమకి (చేతికంది నంత వయస్సున్న) ఎదిగిన కొడుకుండేవాడు, ఉండే వాడేమిటి? వున్నాడు. లేకలేక ముదురు వయస్సులో పుట్టినవాడు తమకి కాకుండా పోయాడు. వాడెక్కడున్నాడో, బ్రతికి ఉన్నాడో లేదో! అస్తమానం తను తలుస్తున్నట్టే చుక్కమ్మ కూడా తలుస్తుంది. గానీ పైకి చెప్పేందుకు ఓపిక లేదు. మనిషి దిగులుతో కుంగిపోయి మంచం పట్టింది. అసలది ఎలా జరిగింది?.

తను వ్రేపల్లెకు నాయకుడై న నందయ్యగారింట్లో పాలి కాపుగా ఉండేవాడు. ఎడ్ల జతలని చాలా జాగ్రత్తగా చూసుకునేవాడు. తమకు అపురూపంగా పుట్టిన మగబిడ్డని చుక్కమ్మ శ్రద్ధగా పెంచుకుంటే వాడికి నాలుగేళ్ళు వచ్చాయి. ఒకనాడు... ఆనాడు... తమ జీవితాలకి శాపమైన ఆరోజు.. తను పొలంలో ఉన్నాడు. పొరుగింటి రైతులు తమ పొలాల్లో పండిన కూరగాయల్ని బళ్ళల్లో వేసుకుని మధురలో అమ్ముకునేందుకు వెడుతుంటే వాళ్ళ ఇళ్ళల్లో

తిరుగుతూ వాళ్ళకి మాలిమి అయిన తనపిల్లవాడు వాళ్ళతో బండెక్కి వెడతానని మారాంచేశాడు. ఎంతో ప్రాణంగా గారాబంగా చూసుకునే తల్లి వద్దని ఎంత వారించినా పొరుగింటి వాళ్ళు పోన్లే అమ్మా ! బిడ్డ ఏడుస్తున్నాడు మేం జాగ్రత్తగా చూస్తాం. బండెక్కి సంబర పడిపోతున్నాడు. అంటూ తమతో తీసుకెళ్ళారు. ఇదంతా చుక్కమ్మ చెప్పింది తనకి.

సాయింత్రమైంది బళ్ళు తిరిగొచ్చాయి. బిడ్డ రాలేదు. చాలా కోలాహలంగా ఉన్న మధురానగరంలో పిల్లవాడిని బండిలో కూచోబెట్టి కూరగాయలు అమ్ముకుంటున్న రైతులు చాలా సమయం గడిచాక తిరిగొచ్చి చూస్తే బండిలో పిల్లవాడు కనిపించలేదు. పట్టణంలోని జనమంతా వస్తువులన్నీ కొనుక్కుంటున్న ఆబాటలన్నీ నిండి పోయి ఉన్నాయి. ఎడ్లబళ్ళు, గుర్రాల మీద తిరిగే రాజభటులు, పాలు పళ్ళు అమ్ముకునే ఆడవాళ్ళు, సందు లేకుండా తిరుగుతున్నారు. పిల్లవాడిని తెచ్చిన రైతులు అంగుళంమేర కూడా వదలకుండా వెతికి చూశారు గాని బిడ్డ ఎక్కడా కనిపించలేదు. పిల్లాడి తల్లితండ్రులకి ఎలాగ చెప్పాలోనని గుండెల్లో దడగా ఉన్నా వాళ్ళకి చెప్పక తప్పలేదు. ఆ వార్త వింటూనే దంపతులు కుప్పకూలిపోయారు. నాలుగైదు రోజులపాటు మధురకి వెళ్ళి సందులు గొందులన్నీ వెతికి చూశారు. ఏమీ లాభం లేక పోయింది. ఇచ్చిన వాడే ఎత్తుకు పోతే ఏంచేస్తామని నెత్తీ నోరూ బాదుకున్నారు. అప్పటినుంచీ వారిలో జవసత్వాలు ఉడిగిపోయాయి.

ఇదంతా తెలిసి నందగోపుడు సింగన్నని చూసి జాలిపడ్డాడు. "నీకు ఓపిక ఉన్నంత వరకే పనిచూసుకో" అన్నాడు. పనిచేసి వస్తుంటే యశోదమ్మ ఏదో ఇస్తూ ఉంటుంది. భార్యా భర్తలిద్దరికీ ముందే ముసలితనం వచ్చి మీద పడింది. నందయ్య లోగిలిలో పనిచేసి వస్తుంటే వారింట్లో తిరుగాడుతుండే వారి ముద్దుల బిడ్డని కన్నార్పక చూస్తుండేవాడు సింగన్న. 'కన్నా' అని తల్లి తండ్రులు తమ బిడ్డని ప్రేమంతా గుమ్మరించి పిలుస్తుంటే సింగన్నకి మనస్సులో తమబిడ్డ గుర్తొచ్చి ఆవేదన కలిగేది. ఆ చిన్న తండ్రి ఆట పాటలు అల్లరి పనులు అన్నీ చూస్తూ ఇంటికొచ్చి భార్యతో చెప్తుండేవాడు.

-సశేషం

# సర్వము నీ దయ

(గత సంచిక తరువాయి) – సుశీలా ప్రసాద

"చూడండి సేవకులారా! మీరందరికీ కళ్ళు మూసుకు పోయాయా? మీ అందరి శరీరాల మీద మెరిసే మణులు పొదిగిన ఆభరణాలు ఎవరి దయవలన లభించాయో, ఎవరికి మీరు ఆజన్మాంతం ఋణపడి ఉన్నారో ఆ శ్రీవర్ధన చక్రవర్తిని, నన్ను గుర్తించలేదా?" ఇలా అంటున్న శ్రీవర్ధనుని మాటలు వింటూ సామంతరాజు ముఖంలో తీవ్ర వెటకారం మెదిలింది.

"వెర్రివాడా! ఇంకా నయం నువ్వు రాజసింహాసనం దగ్గరకి పోయి అక్కడ కూడా యీ విధంగానే పలికితే విచారణ చేసి ప్రభువు నిన్ను శిక్షించగలరు. జాగ్రత్త! ఈ వెండి నాణెం తీసుకుని నీ అవసరాలను తీర్చుకో! ప్రభువు సేవకులకి మాత్రం దూరంగా వుండమని నా సలహా" అంటుండగా వాని పల్లకీ ముందుకి సాగిపోయింది.

మూసిన గుప్పిటలోని నాణెంతో శ్రీవర్ధనుడు మిగిలి పోయాడు. చివరి కాగడాల వెలుగులో అతగాడు నాణెం వంక చూశాడు. కిరీటమూ, రాజదుస్తులూ భూషణాలు అలంకరించుకుని మెరిసిపోతూ ప్రపంచమంతటి కన్నా అత్యున్నతస్థాయిలో ఉన్నాడన్న చిహ్నంగా భూవలయం పైన కాలు మోపి సింహాసనాసీనుడై ఉన్న శ్రీవర్ధన చక్రవర్తి రూపం ఆ నాణెంపైన ముద్రించబడి ఉంది. నిరాశలో, వెలుగు అంతరించిన వెనుక చీకటిలో బరువుగా పడే అడుగులతో నడచి పచ్చికపైన ఒరిగి నిద్రాదేవి ఒడిలోకి జారిపోయాడు చక్రవర్తి.

సూర్యోదయమైనది. పక్షుల కిలకిలారావాలు వింటూ నిద్ర మేల్కొన్నాడు చక్రవర్తి. ముందునాటి ఉదయానికి అంతా వ్యతిరేకమైన ఉదయం ఇది. అయినా తనలో ఏవో కొత్త ఆశలు చిగురిస్తుంటే నూతన శక్తి కలిగి లేచాడు. అంతా గమనిస్తే తను నగర ప్రాకార ద్వారానికి దగ్గర్లోనే ఉన్నట్లు గ్రహించ గలిగాడు. ప్రజలంతా సందడిగా ఎవరి పనులమీద వారు త్వరత్వరగా నడచి పోతున్నారు. జనసమూహంలో కలసి శ్రీవర్ధనుడు నగర ద్వారం చేరుకున్నాడు. వారందరిలో పట్టణంలోనికి ప్రవేశించటం సులభమనుకున్న శ్రీవర్ధనునికి విధి మళ్ళీ ఎదురు తిరిగింది.

నగ్న దేహంతో జన సమర్ధంలోనికి వచ్చిన శ్రీవర్ధనుని

చూడగానే ప్రజలలో విపరీతమైన గందరగోళం బయలు దేరింది. ఏదో దుర్ఘటన వలన వాని దుస్తులు పోయాయి అనుకున్నారు.

ఒక రైతు యువకుడు తన ధాన్యపు శకటంలో వానిని తీసుకుపోయి పట్టణంలో వదులుతానని తన బండిలో ఎక్కించుకున్నాడు. " కాస్త తేరుకున్నాక నీసంగతి చెప్తువు గానిలే" అన్నాడు అతడు. అంటూ తన పై బట్టను వంటికి చుట్టుకోమని రాజుకి అందించాడు. తన నిజ వృత్తాంతం చెప్తే ఆరైతు యువకుని వలన తనకు తిరస్కారం ఎదురవుతుందని భయపడిన శ్రీవర్ధనుడు, తనొక విదేశ వర్తకుడినని రాత్రి దొంగలు తన సర్వస్వం దోచుకున్నారని చెప్పి నగరంలో రాజు కొలువులో తన మిత్రుడైన సేవకుడున్నాడని తనను రాజభవనం దగ్గిర దింపి వేయమని చెప్పాడు. రైతు యువకుడు అన్నట్లుగానే రాజమందిర ద్వారం దగ్గిర శ్రీవర్ధనుని దింపి వెళ్ళిపోయాడు.

రాజ భవన ఆవరణలోనికి రాగానే శ్రీవర్ధనుని కొత్తవానివలె చూస్తూ ఒక రాజ భటుడు " ఈ ఆవరణ విడిచి పో పో " అని కేకలు వేయ సాగాడు. శ్రీవర్ధనుడు అతని వంక నిర్లక్ష్యంగా చూస్తూ " ఎందుకు తొందర పడతావు సేవకా! నీ ఎదట నిలిచి నీతో ప్రసంగిస్తున్నది నీచక్రవర్తి శ్రీవర్ధనుడని తెలియదా? " అని గంభీరంగా అన్నాడు. "నీ అంతట నీవే చక్రవర్తినని చాటుకుంటున్నావా పిచ్చివాడా! నీకు తప్పకుండా మతి చలించినది, నీయీ నేరాన్ని ప్రభువు విచారిస్తాడు పద " అంటూ శ్రీవర్ధనుని చేయి పట్టుకుని న్యాయనిర్ణయ మందిరం వైపు లాక్కు పోయాడు. ఆ భటుడు తనసేవకులు, తదితరులు తప్పక గుర్తిస్తారనుకున్న రాజుకి ఆశాభంగమే అయింది. శ్రీవర్ధనుని వద్దకు ఇద్దరు రాజ భటులు వచ్చి " తమ పేరును కళంకపరుచుతున్న రాజ ద్రోహిని తమ సమక్షానికి తీసుకుని రమ్మని శ్రీశ్రీశ్రీ చక్రవర్తి మాకు ఆజ్ఞ ఇచ్చారు." అంటూ శ్రీవర్ధనుని చేతులు విరచి కట్టి పట్టుకుని నడిపించ సాగారు.

శ్రీవర్ధనుడు "ఇక ఇదే ఆఖరి అవకాశం. నా స్వంత భవనంలో నా రాణిని, మర్యాదస్తులైన నా రాజోద్యోగులు అందరినీ ముఖా ముఖీ కలుసుకోబోతున్నాను, వాళ్ళుకూడా నన్ను గుర్తించలేక పోయినట్లయితే ఇక ఎప్పటికీ నేను అదృష్ట హీనుడనే. " అని తలపోస్తూ భటుల మధ్య నడవ సాగాడు.

-సశేషం

# బ్రహ్మ కడిగిన పాదము

– వశిష్ఠ

మానవుడు ప్రకృతిలోని రూపాలను చూసి మురిసి, భ్రమిస్తాడు. సర్వప్రకృతికి కాంతిని, అందాన్ని యిచ్చే, స్థావర జంగమాలకు కూడా శక్తినిచ్చే అనంత శక్తి స్వరూపిణి, తేజోరాశి అయిన జగజ్జననే కదా. ఆ తల్లి కమనీయాకృతిని దర్శించిన కన్నులు యిక ప్రకృతి రూపాలపైకి పోమ్మన్నాపోవు. భవతాపాలను హరించే ఆ జగజ్జనని దివ్యనామ మాధుర్యాన్ని ఒక్కసారి చవిచూస్తే యిక వదిలి పెట్టరు. జగజ్జనని నామ మాధుర్యం గ్రోలే మహాత్ములు ముఖతేజస్సు సర్వజీవులకు శాంతినిచ్చే ఆ మందహాసము అవే ఆయన ఆనందానుభూతికి మౌనవ్యాఖ్యానాలు.



ఆమె జగన్మాత 'అమ్మ' - 'అమ్మ' అనేది ఎంత మధురమైన పిలుపు! 'అ' బ్రహ్మబీజము, 'మ' అమృత బీజము. కనుకనే 'అమ్మ' బ్రహ్మామృత స్వరూపిణి. ఆ బ్రహ్మామృతము సకల సౌభాగ్యాలను, అతులిత ఐశ్వర్యాలను యిస్తుంది. ఏ యే జీవుడికి ఎప్పుడెప్పుడు ఏది అందజేయాలో వాటిని అందజేస్తుంది. మరి అది పొందాలంటే ఏం చేయాలి? మనసుకు యింద్రియాలకు అందదు. వాక్కుకు అసలే అందదు. కనుకనే 'యత్పరం సకలవాగగోచరం, గోచరం విమలబోధ చక్షుషా' అన్నారు.

గురుదేవుని నిర్మలబోధా శ్రవణ, మనన, ధ్యానములవలన లభించిన జ్ఞాననేత్రంతో మాత్రమే దర్శించగలము. జగజ్జనని దివ్య పాదార విందములను మనసునందు నిలిపినప్పుడే బ్రహ్మామృతాన్ని అందుకోగలం. అట్టి జగన్మాత పూజామహోత్సవాలలో పాల్గొని ఆ బ్రహ్మామృతాన్ని మీ మీ పాత్రలలో, ఘటాలలో నింపుకుంటున్నారు. ఈ ఘటం (శరీరం) నిండా ఆ పదార్థమే నింపుకుంటే ఇక అందులో విషయాదులకు, సంకల్పాలకు, నీచగుణాలకు తావెక్కడ ఉంటుంది? బిందె నిండా నీరు ఉంటే, యిక అందులో ఏమి యిముడుతుంది? భయరహితులై ఆత్మజ్ఞాన సంపన్నులై ప్రకాశిస్తారు. దరహాస కిరణాలు వెదజల్లుతూ జనని అదే చెబుతోంది. నమ్మండి. నమ్మినవారికి నమ్మినంత.

"హరే రామ హరే రామ, రామ రామ హరే హరే. హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే" ఈ షోడశాక్షరీ మంత్రం వేద ప్రబోధితం. దాన్ని పారాయణ చేసేటప్పుడు ఊరికే జపమాల తిప్పితే చాలదు. మనసు ఆ షోడశాక్షరీ రూపం ధరించాలి. అప్పుడు ఆ పరమాత్మ రూపమే పొందుతారు. చూడండి! కృష్ణానది అనేక వందలమైళ్ల దూరం నుండి నిజనాధుడైన సముద్రుని చేరుకునేందుకు వస్తున్నది. ఏ పర్వతమూ, ఏ అరణ్యములూ దాన్ని ఆపలేవు. ఆనకట్టకట్టినా ఆ ప్రవాహానికి ఒక ప్రక్క నుండి సందు వదలకపోతే ఆనకట్టను పడగొట్టి అయినాసరే వచ్చేస్తుంది. చవటభూములను సుక్షేత్రాలుగా మార్చుకుంటూ అతివేగంగా సముద్రుని చేరేంతవరకూ శాంతించదు.

భక్తుని ఆవేదన యిలాంటిదే. నీటి నుండి ఒడ్డున పడిన చేపవలె ఆతను గిలగిలా కొట్టుకుంటాడు. తన ప్రభువుని చేరుకుంటే కాని అతనికి శాంతికలగదు. కృష్ణపరమాత్మను గురించి రాధ అలాగే ఆవేదన పడింది. ఆయన మధురాధిపతే, "మధురాధిపతే రఖిలం మధురం" అని వర్ణించాడు దాన్ని అనుభవించిన ఒక భక్తుడు. ఆ మధురాన్ని రుచి చూసిన రాధ యిక సర్వమూ మరచి, అనుక్షణం దాని కోసమే పరితపించేది. అది అందుకున్ననాడే ఆమెకు శాంతి.

ఒకరైతు తన పొలానికి ప్రక్కనున్న కాలవ నుండి నీరు పెట్టాలి. బోదె తవ్వటం ప్రారంభించాడు. తదేక దీక్షలో పనిచేస్తాడు. నీరు అందినప్పుడు యిక అతని ఆనందం చెప్పనక్కర్లేదు. అలాగే భక్తుడు జ్ఞానతీర్థాన్ని భక్తి అనే బోదె గుండా తన హృదయ క్షేత్రంలోకి ప్రవేశపెట్టడానికి అడ్డుగా ఉన్న గుణాలు, కోరికలు మొ॥గు ఎత్తుపల్లాలను సమం చేసుకుంటూ వస్తాడు. ఆ తీర్థం హృదయక్షేత్రంలో ప్రవేశించి, ఆ క్షేత్రాన్ని సారవంతంగా చేసి, ఫలిస్తే అతడు క్షేత్రజ్ఞుడౌతాడు.

ఆ జ్ఞానతీర్థమే గురుపాదతీర్థం. ఆ పాదము బ్రహ్మకడిగిన పాదము. ఆ పాద తేజస్సు దర్శించటానికి ఆయన ఎనిమిది కళ్ళూ చాలలేదు. ఆ తీర్థమహిమ వర్ణించటానికి ఆయన నాలుగు ముఖాలూ, వాటి నుండి వెలువడిన అనంత వేదాలూ చాలలేదు. మనోపుష్పంతో అర్చించుకుని తరించాడు. బ్రహ్మ ఒక్కడే కాదు, సకలదేవతలూ ఆ పాదాబ్జమందలి అమృతం సేవించటం వలనే చావులేనివారైనారు.

–సశేషం

# త్యాగి

- సుషుమ్న ప్రసాద

కావేరీనది బంగాళాఖాతంలో కలిసేచోట ఓడరేవు వద్ద పూంపుహార్ అనే ప్రసిద్ధికెక్కిన పట్టణం ఉండేది. క్రీ.శ ఏడవ శతాబ్దంలో ఆ నగరమందు ఒక గొప్ప శివభక్తుడు నివసించేవాడు. అతనిపేరు అయిర్ పాగై (తమిళంలో ఆ పదానికి 'అత్యాశ', 'స్వార్థం' అనే మానవ సహజ లక్షణాలకు ప్రబల శత్రువు అని అర్థం). అతను వాణిజ్య కులానికి చెందిన సంపన్నుడు. త్రికరణశుద్ధిగా తన సంపదను పరమేశ్వరుని సేవకు, ఆయన భక్తుల సేవకు వినియోగించాలన్నదే ఆయన జీవిత ధ్యేయం.

అహోరాత్రాలు అయిర్‌పాగై గృహద్వారములు శివభక్తుల సేవకై తెరచిఉంచి, వారికి నిరంతరము సేవ, మర్యాదలు చేస్తూ ఉండేవాడు. ఆయన భక్తి ధార్మిక లక్షణాలతో దేశమంతా ప్రసిద్ధికెక్కాడు. అయిర్‌పాగై తన భక్తులకు చేసే దానధర్మాలకు, భక్తికి భగవంతుడు మెచ్చి, ప్రపంచానికి అతని భక్తిని నిరూపించాలనుకున్నాడు.

ఒకనాడు పరమేశ్వరుడే తన భక్తిని పరీక్షించటానికి ఒక బ్రహ్మచారి వేషం ధరించి, అయిర్‌పాగై యింటికి వచ్చాడు. తన ధ్యేయం నెరవేరుతుందనే నమ్మకంతో తాను యితర దేశం నుండి వస్తున్నానని చెప్పాడు.

అయిర్‌పాగై ఆ భక్తుని చూసి చాల సంతోషించాడు. చక్కని అతిథి మర్యాదలతో స్వాగతం పలికాడు. తరువాత ఆ భక్తుని తన కోరిక ఏమిటో తెలియజేయమని అది నెరవేర్చుటకు తాను సంసిద్ధంగా వున్నానని చెప్పాడు. అతిథి కొంతసేపు తటపటాయించాడు. వెంటనే యింటి యజమాని 'అయ్యా! మీరేమీ సంకోచించకండి. మీ కోరిక నేను తప్పక నెరవేరుస్తానని హామీ యిచ్చాడు. అప్పుడా బ్రహ్మచారి 'అయ్యా! నాది చాల విపరీతమైన కోరిక. మీకు చాల చికాకు కలిగిస్తుంది. అందుచేతనే నా కోరిక వెల్లడి చేయటానికి సంకోచిస్తున్నాను. నేను 'మీరు మీ వద్దకు వచ్చిన భక్తుడెలాంటి కోరికలు కోరినా తీర్చటమే ధ్యేయంగా పెట్టుకున్నారని విన్నాను. వెంటనే అయిర్‌పాగై యిలా సమాధానం చెప్పాడు 'అవునండీ! నాకందుబాటులో

ఉన్న వనరులన్నీ కేవలం పరమేశ్వరుని ప్రసాదమే! అందువలన నా కున్న సంపదంతా, మీవంటి భక్తుల సేవకు, సౌకర్యాలకే వినియోగిస్తాను. మీరు సందేహించ వలసిన ఆవశ్యకత లేదు. తమ కేమి కోరిక ఉన్నదో వెంటనే తెలియ జేయండి. అప్పుడు ఆ భక్తుడు యిలా అన్నాడు - 'మీ మాటలతో నేను చాల తృప్తి పడ్డాను. చాలకాలంగా పవిత్ర గ్రంథాలు చదువుతూ బ్రహ్మచారి జీవితం గడుపుతున్నాను. ఇప్పుడా దశ ముగిసింది. నాకు గృహస్థుడు కావాలనే కోరిక కలిగింది. నీ భార్య సౌందర్యం చూసి, నా మనసు పరవశించింది. ఆమెను నాకు కానుకగా ఇవ్వగలవా?' అన్నాడు.

అయిర్‌పాగై ఆగంతకుని కోరిక విని క్రోధావేశాలకు లోను కాలేదు. పైగా అతని కోరిక విని ఎలాంటి తొట్రుపాటు లేకుండా 'అయ్యా! మీ కోరికను సులువుగా తీర్చగలను. కొద్ది నిమిషాలు వేచిఉంటే, నా భార్యను తీసుకువస్తా'నని చెప్పాడు. అలా మాట్లాడుతూ లోపలికి వెళ్ళి, తన భార్యతో ఆ భక్తుని వింతకోరికను తెలిపి, 'నేను ఆ భక్తుని కోరికను తీరుస్తానని హామీ యిచ్చాను' అని చెప్పాడు. ఆమె భర్తమాటలు విని ఎంతో కలవర పడింది. మరల సహధర్మచారిణిగా తనకు తాను స్థిమితపడి 'మీ నిర్ణయప్రకారం నా కర్తవ్యం నెరవేర్చటానికి సంసిద్ధురాలను' అంది.

ఆమె సంచి నిండా బంగారు నాణెములు నింపుకుని, ఆగంతకునితో బయలుదేరటానికి సిద్ధమైంది. అయిర్‌పాగై తన భార్యను అతిథి దగ్గరకు తీసుకువచ్చి 'ఇకపై ఆమెను మీ సేవకు వినియోగించు కోవచ్చు' అన్నాడు. అతిథి సంబరపడ్డాడు. కాని వెంటనే ఆందోళన పడుతున్నట్లు కనిపించాడు. అయిర్‌పాగై భక్తుని ఆందోళనకు కారణమేమని ప్రశ్నించాడు. అప్పుడాభక్తుడు యిలా సమాధానం చెప్పాడు 'మీరు చాల గొప్పవారు. కాని మీ బంధువులు, యీ నగర ప్రజలు తప్పని సరిగా మీరు చేసిన పనికి కోపోద్రిక్తులై నాపై దాడి చేస్తారని భయంగా ఉన్నద'న్నాడు. 'ఈ విషయంలో మీ చింతలన్నీ పక్కకు పెట్టండి నేను కూడా యుద్ధం చేయగలను. నేను ఆయుధం ధరించి మీపై ఎలాంటి దాడి జరగకుండా సంరక్షిస్తాను. మీరిద్దరు మీ గమ్యం చేరేవరకు మీ వెంటనుండి మీకెలాంటి ప్రమాదం జరగకుండా కాపాడతా'నని

అయిర్‌పాగై భక్తునికి హామీ యిచ్చాడు.

అతను భయపడినట్లే అయిర్‌పాగై బంధువులు, పూంపుహార్ పట్టణ ప్రజలు కత్తులు, కత్తులు, కటారులతో పరుగెత్తుతూ వారిపైకి దాడికి వచ్చారు. 'ఇతను శివభక్తుడు కాదు. భక్తవేషధారి అయిన స్త్రీ కాముకుడు. పరాయి వాని భార్యను కోరుకోవటం నీచమైన చర్య. దీన్ని మేము అంగీకరించం. ఈ విధంగా నీ భార్యను యితరులకు ధారాదత్తం చేయటానికి ఆమె నీ ఆస్తి కాదు' అని వారందరూ ఎలుగెత్తి అరిచారు.

కాని అయిర్‌పాగై కించిత్తైనా చలించలేదు. అతను తన కత్తిని ఝుళిపిస్తూ 'ఈ భక్తునికి ఎవరు అపకారం చేసినా నేను సహించను' అని గర్జించాడు. కొంతసేపటికి అయిర్‌పాగైను నిందిస్తూ వారంతా తిరుగు ముఖం పట్టారు. వారిద్దరిని క్షేమంగా నగరశివారుకు చేర్చిన తరువాత భక్తునితో అయిర్‌పాగై యిలా అన్నాడు ' అయ్యా! మేము నీతిమంతులమని విర్రవీగేవారిని తరిమివేశాను. ఇప్పుడు మీరు మీ యిష్ట ప్రకారంగా వెళ్ళండి' అని వెను తిరిగేసరికి, పెద్ద కేక వినిపించింది. 'అయిర్‌పాగై! నేను మళ్ళా కష్టాలలో పడ్డాను రక్షించు'. అతనా కేక విని పరుగెత్తుకుని వచ్చేసరికి ఆ బ్రహ్మచారి అదృశ్యమయ్యాడు. తన భార్య మాత్రమే ఒంటరిగా నిలబడింది. అతనేమి జరిగిందని భార్యను ప్రశ్నించాడు. ఆమె 'నాకంతా అయోమయంగా ఉంది. అతను పెద్దగా కేకవేసిన తరువాత ఆకస్మికంగా అదృశ్యమయ్యాడు' అంది.

అలా దిగ్భ్రాంతికి లోనైన భార్యాభర్తలకు పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమయ్యారు. పరమేశ్వరుని వాణి యిలా వినిపించింది. 'నా పట్ల, నా భక్తులపట్ల నీకున్న అచంచల భక్తిని ప్రపంచానికి చాటటానికి నేను నాటకం ఆడాను. మీ దంపతులిరువురూ నాతో కైలాసానికి వచ్చి, నిరంతర సేవ చేసుకునే సమయం ఆసన్నమయింది.' తన కత్తికి లొంగిపోయిన వారికి కూడా పరమేశ్వరుడు అభయం యిచ్చాడు. అప్పటి నుండి అయిర్‌పాగై అయిర్‌పై ముగ్గురు నాయనార్లలో ఒకడిగా ప్రసిద్ధికెక్కాడు.

# రజతోత్సవ వేడుకలు

శ్రీ విజయనామ సంవత్సర కార్తీక బహుళ తదియ ది.20-11-13 బుధవారం నుండి బహుళ త్రయోదశి ది. 1-12-13 ఆదివారం వరకు ఏకాదశాహ్నిక దీక్షతో శ్రీకాళీవనాశ్రమంలో శ్రీసద్గురు పరమహంస గాయత్రీ మహాయాగము; ప్రాతఃకాల ప్రార్థన; మహామంగళ హారతులు; శ్రీ సద్గురు పాదుకా ప్రదక్షిణ; బ్రహ్మశ్రీ కొండూరి రామ సుబ్రహ్మణ్య ప్రసాద్‌గారిచే వేదపఠనము; శ్రీ జపమాలా ప్రసాదగారిచే శ్రీగురుగీత; ప్రవచనములు; మధ్యాహ్నం 2-30ని॥లకు శ్రీసద్గురు లక్షనామార్చన; మహా మంత్రపుష్పము, దర్బారు; సాయంకాల ప్రార్థన; మహామంగళ హారతులు; పంచ యజ్ఞ విధులతో (శత సహస్ర నామార్చన; అఖండ భగవన్నామ సంకీర్తన; శ్రీగురునామ కోటిజపం; అఖండ ధ్యానం; అఖండ పారాయణ;) నిత్యకార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

విశేష కార్యక్రమాలు -

ది. 20-11-13 ఉదయం శ్రీమాతాజీ దీక్షా స్వీకారము, అఖండ జ్యోతి ప్రజ్వలన అనంతరము పంచయజ్ఞ విధులతో కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. తదనంతరం జపమాల ప్రసాదగారిచే గురుగీత ప్రవచనం జరిగింది. కర్తలు దీక్షావస్త్రధారణ చేసి, ఏకాదశాహ్నిక దీక్ష తీసుకున్న తరువాత, యాగశాల ప్రవేశము. మండపారాధన అగ్ని ప్రతిష్ఠాపన, సద్గురుహోమం, సద్గురు ప్రసాదిత మూలమంత్ర హోమం, లింగార్చన, సూర్య నమస్కారాలతో యాగ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆరోజు రాత్రి శ్రీసద్గురుదేవుల మహాపుణ్యారాధన జరిగింది.

ది.21-11-13న బృందావనంలో శ్రీసద్గురుదేవులకు మహాకుంభాభిషేకం సముద్రపు మరియు 108 నదీజలలాలతో, పంచామృతాలతో, ఫలరసాలతో జరిగింది. గురు భక్తులచే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరిగాయి.

ది.22-11-13న శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీకాళీమాత, నవగ్రహ ఆలయాలకు మహాకుంభాభిషేకం జరిగింది.

ది.23-11-13న శ్రీసీతారముల, శ్రీరాధాకృష్ణుల ఆలయాలకు మహాకుంభాభిషేకం జరిగింది.

ది.24-11-13 క్షేత్రపాలకుడైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి మహాకుంభాభిషేకం జరిగింది. ఉదయం 9గం.లకు సాధు ధర్మ సమ్మేళనం శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారి సర్వాధ్యక్షతతో ప్రారంభమైంది. ప్రథమ మహా సభకు వారే అధ్యక్షత వహించారు. ఆశీః

ప్రవచనం శ్రీరామకోటి రామకృష్ణానంద స్వామివారు చేశారు. ఈ సభలో శ్రీ స్కందదేవానందగిరి స్వామివారు, శ్రీనిత్యానంద భారతీస్వామివారు, శ్రీమాతా జ్యోతిర్మయానంద స్వామినివారు, శ్రీమాతా కృష్ణానందగిరి స్వామినివారు ప్రసంగించారు. ప్రార్థనతో ఆనాటి ప్రథమ సభ ముగిసింది. రాత్రికి నృత్య కళాభారతి గుంటూరువారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన జరిగింది.

ది. 25-11-13 సాధు ధర్మసమ్మేళనం ద్వితీయ మహాసభ ఉదయం 9గం.లకు ప్రారంభమైంది. ఆచార్య శ్రీ శంకరానందగిరి స్వాములవారు అధ్యక్షత వహించారు. శ్రీ బ్రహ్మానందతీర్థ స్వామివారు ఆశీః ప్రవచనం చేశారు.శ్రీకృష్ణానంద స్వాములవారు, డా॥కలిబసవ రాజేంద్ర మహాస్వాములవారు, శ్రీహరి తీర్థ స్వాములవారు, శ్రీవాసుదేవానందగిరి స్వాములవారు, శ్రీ మాతా శివచైతన్యానందవారు, శ్రీ అభేదానంద భారతీ స్వాములవారు తమ దివ్య సందేశాలను అందించారు. అనంతరం శ్రీమాతాజీవారి అభిభాషణ, ప్రార్థనతో ద్వితీయ సభ ముగిసింది. రాత్రి శ్రీబాబు భక్త సమాజ్ ఢిల్లీవారిచే కథక్ నృత్య ప్రదర్శన జరిగింది.

ది. 26-11-13 సాధు ధర్మ సమ్మేళనం తృతీయ సభ ఉదయం 9గం.లకు ప్రారంభమైంది. ఈ సభకు శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు అధ్యక్షత వహించారు. శ్రీ పరిపూర్ణానందస్వాములవారు ఆశీః ప్రవచనం చేశారు. శ్రీమాతా పరావిద్యానందగిరివారు, శ్రీ స్వస్వరూపానందగిరి స్వాముల వారు, శ్రీ పరమాత్మానందగిరి స్వాములవారు, శ్రీమాతా త్యాగీశానందపురి వారు, శ్రీవిద్యాస్వరూపానందగిరివారు ఉపన్యసించారు. వీరు సావనీర్ 'సమర్థ సద్గురు దేవో భవ' ఉద్ఘాటన చేశారు. తదనంతరం శ్రీమాతాజీవారు ఉపన్యసించారు. అనంతరం ప్రార్థనతో తృతీయమహాసభ ముగిసింది. రాత్రి సంగీత గాత్ర కచేరీ జరిగింది.

ది.27-11-13 సాధు ధర్మసమ్మేళనం చతుర్థసభ. ఉదయం 9గం.లకు ప్రారంభమైంది. శ్రీదండి నిర్మలానందగిరి స్వాములవారు అధ్యక్షత వహించారు. శ్రీ మాతా గాయత్రీబాయమ్మగారు అశీః ప్రవచనం చేశారు. రామకృష్ణాశ్రమం శ్రీమాతా బోధానందపురి ఉపన్యసించారు. వీరు "సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ సహస్ర నామ అష్టోత్తర శతనామావళి - లఘువ్యాఖ్యానం" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. తరువాత శ్రీమాతాజీ ఆశీఃపూర్వక ప్రసంగం చేశారు.

ఉదయం 11గం.లకు 25మంది సాధుమహాత్ములకు యతీశ్వరపూజ శ్రీమాతాజీవారు పురుషసూక్తపరంగా 25మంది

దంపతులచేత చేయించారు. పూజానంతరం వారికి ఉపయోగపడే నిత్యావసర 25 వస్తువులు బ్యాగ్‌ల్లో పెట్టి వారికి సమర్పించారు.

ది.28-11-13 తె.జా 3గం.లకు శ్రీగురుదశమి సందర్భంగా శ్రీసద్గురు దేవులకు బృందావనంలో నమకచమక సహితంగా భక్తులందరూ మహాభిషేకం చేసుకున్నారు. ఉదయం 9గం.లకు ప్రథమ గురుభక్త సమ్మేళనం శ్రీమాతాజీ ప్రారంభించారు. మధ్యాహ్నం 2-30ని॥లకు శ్రీసద్గురు లక్షనామార్చన జరిగింది. రాత్రి 8గం.లకు సద్గురుదేవుల మహారాధన జరిగింది. అంతటితో ఆనాటి కార్యక్రమాలు ముగిశాయి. గోపూజ, హోమం, అనంతరం సత్సంగ సమావేశం జరిగింది. మధ్యాహ్నం 12-30ని॥లకు సద్గురుపాదపూజ లక్షనామార్చన మహోత్సవం జరిగింది.

ది.29-11-13 ఉదయం 9గం.లకు సత్సంగసమావేశము, 2-30ని॥లకు లక్షనామార్చన, రాత్రి 8-30ని॥లకు ఊంజలసేవతో ముగిసింది.

ది.30-11-13 ఉదయం 9గం.లకు సత్సంగసమావేశము, 2-30ని॥లకు లక్షనామార్చన, రాత్రి 8-30ని॥లకు నౌకావిహారం (తెప్పోత్సవం).

ది.1-12-13 ఉదయం 7-30ని॥ పూర్ణాహుతి జరిగింది. సద్గురుదేవుల నగరోత్సవం జరిగింది. అనంతరం శ్రీసద్గురు పాదపూజ, కృష్ణానదీ విజయవాడ ఘాట్‌లో అవబృత స్నానం, పాదుకాభిషేకంతో రజతోత్సవకార్యక్రమాలు శ్రీగురుదేవుల వరమానుగ్రహంతో దిగ్విజయంగా ముగిశాయి.



## -నివేదిక-

మనందరి దైవమైన సమర్థ సద్గురుదేవులు శ్రీబాబూజీ మహరాజ్‌వారు 03-12-1988 సాయంత్రం 5-15ని॥లకు, అనగా కార్తీక బహుళదశమి రోజున తమ అవతార పరిసమాప్తి చేశారు. ఇప్పటికి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో రజతోత్సవ మహా పుణ్యారాధన నిర్వహింపబడింది.

శ్రీ బాబూజీమహరాజ్‌వారి అత్యంత అంతరంగిక భక్తులలో అగ్రశ్రేణికి చెందినవారుశ్రీ మావులేటి చిరంజీవిరాజుగారు (పూజ్యశ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి పితృదేవులు). గురుదేవుల అభిమానాన్ని, ప్రేమను, అనుగ్రహాన్ని పరిపూర్ణంగా చూరగొనగలిగిన సచ్ఛిశిష్యులు.

శ్రీచిరంజీవిరాజుగారు 03-12-1963 సాయంత్రం 5-15ని॥ లకు అనగా కార్తీక బహుళ తదియరోజు, శ్రీబాబూజీమహరాజ్‌వారి సమక్షంలో, శ్రీశైల క్షేత్రంలో బ్రహ్మైక్యం చెందారు. ఇప్పటికి 50సంవత్సరాలు. స్వర్ణోత్సవాలు పూర్తి అయ్యాయి.

శ్రీగురుదేవులు శ్రీరాజుగారి ఆరాధనను ప్రతి సంవత్సరం జరుపుతూ ఉండేవారు. ఆ సమయంలో గురుసోదరులకు సత్సంగాన్ని, దివ్యమైన బోధను అనుగ్రహిస్తూ ఉండేవారు. శ్రీగురుదేవులు, వారి ఆత్మీయ శిష్యులు ఒకే తేది, ఒకే సమయంలో స్వస్థానం చేరుకోవటం కేవలం యాదృశ్చికం ఎప్పటికీ కాదు. అంతా శ్రీగురుదేవుల ప్రణాళిక. ప్రతి సంవత్సరం శ్రీగురుదేవుల సచ్ఛిష్యుని బ్రహ్మైక్యం కార్తీక బహుళ తదియ మొదలుకొని, శ్రీగురుదేవుల అవతార సమాప్తిరోజు కార్తీక బహుళ దశమి వరకు ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.

అదే విధంగా ఈ సంవత్సరం రజతోత్సవ మహాపుణ్యారాధన నిర్వహించుకొన్నాము. ఈ కార్యక్రమానికి ఎంతెంతోమంది భగవద్భక్తులు, గురుభక్తులు, మహానుభావులు, సాధుమహాత్ములు అనేక సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసి, సాధుధర్మ సమ్మేళనము, పరమహంస గాయత్రీ యాగము, మహాకుంభాభిషేకములు, శ్రీగురుదేవుల లక్షనామార్చనలు ఎంతో దివ్యంగా, భవ్యంగా, నయనానందకరంగా, న భూతో, న భవిష్యతి అన్నట్లుగా ఎంతో వైభంగా శ్రీగురుదేవులు జరిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పొందిన ఆనందం అనిర్వచనీయం, అనంతం. ఈ కార్యక్రమములను జయప్రదం చేయుటకు విచ్చేసిన సాధు మహాత్ములకు ఎంతో ఋణపడి ఉంటాము.

# శ్రీగురుదేవుల చిద్విలాస లీలలు

- రమణ ప్రసాద్

17-10-1988లో జరిగిన శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో శ్రీబాబూజీవారు సింహాసనం అధిష్ఠించి దివ్యోపన్యాసం యిస్తున్న సమయంలో భక్తులందరూ కదలకుండా కూర్చుని వింటున్నారు. ఆ రోజు ఏకధాటిగా వారి బోధ ఏడెనిమిది గంటలపాటు కొనసాగింది.

శ్రీబాబు భక్తులను యిలా ప్రశ్నించారు "ఏ శక్తి మిమ్మల్ని యిలా కదలకుండా యిన్ని గంటలు కూర్చోబెట్టింది?" తిరిగి వారే మాట్లాడుతూ, "అదే గురుశక్తి. ఈ సమయం మీ నిత్యకాలంలో జమవుతుంది" అన్నారు.

శ్రీబాబు తాము బోధ చేస్తూ, వెంకటరమణ ప్రసాద్‌గారిని స్టేజి మీదకు పిలిచారు. (వెంకటగిరిలో గవర్నమెంట్ కాలేజ్‌లో వారు ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఇంగ్లీష్ ప్రొఫెసర్ కాక, తెలుగులో అష్టావధానం కూడా చేసేవారు.) వారిని భగవద్గీతలో యీ క్రింది శ్లోకానికి అర్థం చెప్పమన్నారు.

యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః ।
జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః ॥

(భగవద్గీత 4.అ - 13శ్లో)

"దీని శ్లోకార్థం ఫలాసక్తి లేకుండా అన్ని కర్మలూ ఆచరించటంతోపాటు జ్ఞానమనే అగ్నిలో పూర్వపు వాసనలను దగ్ధం చేసుకున్నవాడిని 'పండితుడ'ని బుధలు చెబుతారు" అని.

ఈ శ్లోకానికి అర్థం ప్రసాదరావుగారు ఎన్ని సార్లు చెప్పినా బాబు అంగీకరించలేదు. 'అబ్బే బాగా రాలేదు' అనీ; 'ఈ విషయం అప్పుడు పుట్టిన పిల్లాడి తండ్రి కూడా చెబుతాడు' అన్నారు.

"ఏదీ తిరిగి ఆ శ్లోకం చదువు. ఒకొక్క పదానికీ అర్థం చెప్పు" అన్నారు. శ్రీ ప్రసాదరావుగారు చెప్పారు. కాని బాబు "లేదు సరిగా రాలేదు" అన్నారు. ఇలా ఎంతో సేపు చర్చ జరిగింది. తరువాత సభలోని వారిని ప్రశ్నిస్తూ "ఏమండీ! భగవానుడు చెప్పిన యీ శ్లోకానికి అర్థం యీ విధంగా చెబితే మీరు అంగీకరిస్తారా? ఇలాగే పండితులు శ్లోకానికి అర్థం చెబితే, ఆ శ్లోకం లోకంలోకి వస్తే శోకంలో పడుతుంది" అన్నారు. ఆ తరువాత తారకంగారిని చెప్పమన్నారు. వారు దానికి అర్థం చెబుతూ

"యస్య అంటే ఏ మహనీయుని కృపచేత సర్వసంకల్పాలు జ్ఞానాగ్నిలో వ్రేలుస్తాడో, అతడే పండితుడని బుధులు చెబుతారు" అని చెప్పారు.

బాబు "కరెక్ట్! గురువు అనుగ్రహం లేనిదే నీ అంతట నీవు సంకల్పాలను జ్ఞానాగ్నిలో ఎలా దగ్ధం చేస్తావు? 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి' అన్నదానిని మీ హృదయ బాబు 'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి' అని చెబుతున్నాడు" అన్నారు.

శ్రీవారు తమ బోధను కొనసాగిస్తూ "ఒక గురువుగారు తమ శిష్యులకు ఒక నల్లటి రాక్షసి బొగ్గును యిస్తూ 'దీనిలో ఒక తెల్లటి పదార్థం ఉంది. దాన్ని శుద్ధిచేసి తీసుకురండి' అని ఆజ్ఞాపించాడు. ఒక శిష్యుడు నమక చమకాలతో, పంచామృతాలతో దాన్ని శుద్ధి చేశాడు. లాభం లేక పోయింది. రెండవ శిష్యుడు నదీ జలాలతో శుద్ధి చేశాడు. ప్రయోజనం లేదు. మూడవ శిష్యుడు గురుబోధను మననం చేసుకుని, దాన్ని అగ్నిలో వేసి దగ్ధం చేశాడు. అప్పుడు తెల్లటి విభూతి వచ్చింది. అది గురువుగారికి తెచ్చి సమర్పించాడు. గురువుగారు ఎంతో ఆనందించి, 'భేష్! నా ఉపదేశాన్ని సరిగా అర్థం చేసుకున్నావు' అని అభినందించాడు.

ఇలా బోధ చేస్తున్న సమయంలో ప్రసాదరావుగారు ఏదో చెప్పబోయారు. శ్రీబాబు "ఏదో చెప్పాలనుకున్నావుగా చెప్పు" అన్నారు. "బాబూ! రామాలయం భక్తులకు చాలటం లేదనిపిస్తోంది" అన్నారు ప్రసాదరావుగారు. "నీ ఉద్దేశం ఏమిటి?" అని ప్రశ్నించారు బాబు. "మీ దివ్య బోధను వినటానికి వచ్చిన భక్తులు, లేక దేవతలు అందరూ చోటు లేక బయట నుండి తమ బోధను వింటున్నారనిపిస్తోంది" అన్నారు. "అయితే ఏం చెయ్యాలో చెప్పు" అన్నారు బాబు. "దీనిని పెద్దగా కట్టాలి బాబూ!" అన్నారు ప్రసాదరావుగారు. "సరే! దానికి నువ్వు ఏమిస్తావు?" అన్నారు బాబు. "నేను వెయ్యి యిటుకలు యిస్తాను" అన్నారు. "ఇంకా ఎవరు? ఏమి యిస్తారు? ఎవరు? ఎవరు?" అన్నారు బాబు.

ఇంకా చాల మంది భక్తులు ముందుకు వచ్చారు. వారందరూ కలసి పూనుకొనటంతో రామాలయం ఎక్స్టెంషన్ పూర్తి అయింది. ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయం ఒకటి ఉంది. మహాత్ములు తాముచేసే ప్రణాళిక ప్రకారం కాలక్రమంలో జరిగేటట్లు చేసే సమర్థత కలిగినవారై ఉంటారు. ఈ ప్రణాళిక బాబుదే అయినా, ప్రసాదరావుగారిలో చేరి చేయించారనేది నిర్వివాదాంశం.

వారం రోజులపాటు జరిగిన కృష్ణాష్టమి ఉత్సవాలు అప్పుడే ముగిశాయి. ఈ ఉత్సవాలలో మూడు రోజుల పాటు సాధుధర్మ సమ్మేళనం శ్రీరామాలయంలో జరిగింది.

రాబోయే సద్గురుదేవుల రజతోత్సవాలను దృష్టిలో ఉంచుకుని, భక్తులు శ్రీమాతాజీని "అమ్మా! శ్రీబాబూజీ ఉత్సవాలలో సాధుధర్మ సమ్మేళనం ఎక్కడ చేస్తే బాగుంటుంది?" అని ప్రశ్నించారు. మాతాజీ "రామాలయంలోనే ఏర్పాటు చేద్దాం" అన్నారు. భక్తులంతా "చాలదేమో" అన్నారు. "అయితే గురుకుల ప్రాగంణంలో ఏర్పాటు చెయ్యండి" అన్నారు. అంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది.

19-9-2013 శ్రావణ పూర్ణిమ. శ్రీసద్గురు పాదపూజ జరుగుతోంది. శివాలయ ప్రాంగణంలోని నాపరాళ్ళు తీసి, గ్రానెట్ రాళ్ళు పరుస్తున్నారు. శివాలయం చుట్టూ ఉన్న కాంపౌండ్‌వాల్ శిథిల స్థితిలో ఉండటం వల్ల దాన్ని పడగొట్టి, కొంత కాంపౌండ్‌వాల్ నిర్మించేందుకు తీర్మానం జరిగింది. రేపో మాపో కాంపౌండ్‌వాల్ కట్టబోతున్నారు. శ్రీమాతాజీ బయటకు వచ్చిన సమయంలో ఒక భక్తుడు "అమ్మా! దక్షిణంవైపు కాంపౌండ్‌వాల్ కట్టడం ఆపేస్తే ఎంతో ఖాళీ ప్రదేశం వస్తుందికదా! అప్పుడు మనం సత్సంగం యిక్కడే పెట్టుకోవచ్చు. శ్రీ మాతాజీ "సరే చూద్దాం!" అన్నారు. ఆ మరునాడే ట్రస్ట్ సభ్యులను రమ్మనమని వారితో మాట్లాడారు. వాస్తుపరంగా కూడా చూసి వారంతా ఒప్పుకున్న తరువాత దక్షిణంగా కాంపౌండ్‌వాల్ కట్టడం విరమించుకున్నారు. ఫలితంగా రాబోయే రజతోత్సవాలలో సాధు ధర్మ సమ్మేళనం శివాలయం ప్రాంగణంలో జరుపవచ్చని తీర్మానం చేశారు. ఇది కూడా శ్రీగురుదేవుల (మాతాజీవారి) ప్రణాళిక అని రూఢిగా తెలుస్తోంది. ఒక భక్తునిలో ఒక చిన్న సందేహం లేవదీసి తద్వారా యీ నిర్ణయం తీసుకున్నారు.

ఆనాడు శ్రీబాబు రామాలయం ఎక్స్‌టెంషన్ తమ ప్రణాణిక ప్రకారం జరిపించుకున్నారు. ఈనాడు శ్రీమాతాజీ శివాలయం తమ ప్రణాళిక ప్రకారం మలచుకుని యీ ప్రాంగణం పలువిధాలుగా ఉపయోగ కరమయ్యేటట్లు చేశారు.

సద్గురు లీలలు ఎవరికైననూ ఎన్న తరమా!!

# హేమంత శ్రీమంతం

-R.T.C లక్ష్మి

రంగురంగుల రంగవల్లులతో, చల్లచల్లని పిల్లతెమ్మెరలతో, తెల్ల తెల్లని మంచు ముత్యాల బిందువులతో, బంతి, చామంతుల వికాసంతో అత్యంత రమణీయంగా, ఆహ్లాదంగా యీ మార్గశీర్ష మాసం మనసులను పులకింప జేస్తుంది. ఈ హేమంత ఋతువుని ఎంతో ఆనంద ప్రదమైనదిగా ప్రబంధ కవులు అనేక విధాలుగా వర్ణించారు.

శ్రీకృష్ణ భగవానుడు గీతాచార్యుడై, మానవుని మాధవునిగా నరునిచేత దర్శింపజేసిన అమోఘమైన భగవద్గీతలో 'మాసానాం మార్గ శీర్షోహం' అని ఎలుగెత్తిచాటిన యీ మార్గశీర్షం సాధకలోకానికి మార్గదర్శి అనటంలో అతిశయోక్తి లేదు. చతుర్వేద సారమై, పంచమ వేదంగా కీర్తింపబడిన శ్రీమన్మహా భారతానికే మకుటాయమానం శ్రీ మద్భగవద్గీత.

ఎందరెందరో మహనీయులు శ్రీ భగవద్గీతతో ప్రేరేపింపబడి, తమ తమ విధులను యధావిధిగా నిర్వర్తించి, పేరుగడించారు. మహాత్మా గాంధి భగవద్గీత తన జీవితాన్ని ప్రభావితం చేసిందని చెప్పుకున్నారు. లోకమాన్య బాలగంగాధర తిలక్ స్వరాజ్య సమర సమయంలో బ్రిటీష్ ప్రభుత్వంచే నిర్బంధించబడి కారాగారంలో వున్నప్పుడు, మరాఠీ భాషలో భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసి కాలాన్ని సద్వినియోగపరచుకున్నారట.మాక్స్ముల్లర్
మాక్స్ ముల్లర్వంటి విదేశీ ప్రముఖులు కూడా భగవద్గీత ప్రాధాన్యతను వెల్లడించారు.

మార్గశీర్ష శుద్ధ ఏకాదశిని భగవద్గీత ఆవిర్భవించిన రోజుగా 'గీతా జయంతి' నేటికీ పూజనీయంగా జరుపుకుంటున్నాము. ప్రస్తుత విపరీత పరిస్థితులలో కూడా న్యాయస్థానాలలో శ్రీమద్భగవద్గీత ప్రామాణికంగా నిలచిందంటే, ఆ ప్రాముఖ్యాన్ని గమనించవచ్చు. ఎందరెందరో సామాన్యులు, అసామాన్యులుగా, మాన్యులుగా తీర్చిదిద్ద బడ్డారు భగవద్గీత వలన.

అలనాడు గోపికలు కాత్యాయనీ వ్రతం చేసి, శ్రీకృష్ణ భగవానుని

భర్తగా అనుగ్రహించమని వేడుకున్నది యీ మార్గశీర్షంలోనే. తోటి సాధకులలోని భక్తి భావాన్ని మేల్కొలిపి, భగవంతునికి పూలమాలనే కాక, 'పామాల', 'పద్యమాల' సమకూర్చిన గోదాదేవి తిరుప్పావై యీ మార్గశీర్ష ప్రత్యేకతలలో పేరెన్నిక గన్నది. ఆ పద్యమాలతో పులకించి పూల రంగడైనాడు శ్రీరంగశాయి. యోగీశ్వరుడైన శ్రీ దత్తాత్రేయుని జయంతి, శ్రీ దత్త జయంతిగా మార్గశీర్ష పూర్ణిమ ప్రఖ్యాతి చెందినది. ఈ హేమంతఋతువులో చలికి భయపడి, అగ్నిదేవుడు కూడా శివుని నేత్రములో, సముద్రములో బడబాగ్నిగా, మనుష్యుల యిండ్లలో వంటయింట్లోనూ దాగి ఉన్నాడని పోతనామాత్యుడు చమత్కరించాడు.

ఈ హేమతం మనకు ధ్యానశ్రీని పెంచి, మనందరినీ శ్రీమంతులుగా చేయవలెనని, ఆశీర్వదించవలసినదిగా శ్రీగురు దేవులను వేడుకొందాం!!

ఒకప్పుడు గోపాలుడి క్షేమ సమాచారం ఏమీ తనకు తెలియనందున యశోద, రాధ వద్దకు వచ్చి, "గోపాలుడి సమాచారం ఏమైనా నీకు తెలుసా?" అని అడిగింది. ఆ సమయంలో రాధ దివ్యభావ పరవశురాలై ఉంది. అందుచేత యశోద మాటలు ఆమెకు వినబడలేదు.

రాధ బాహ్య స్ఫురణ పొందాక నందుడి రాణియైన యశోద తన కళ్ళముందు ఉండటం చూసి, వెంటనే ఆమెకు వందనం చేసి, ఆమె రాకకు కారణం అడిగింది. యశోద కారణం తెలుపగా, రాధ యిలా చెప్పింది "అమ్మా! కళ్ళుమూసుకొని గోపాలుడి రూపాన్ని ధ్యానించు. నువ్వు అతణ్ణి చూడ గలవు".

యశోద కళ్ళు మూసుకోగానే స్వయంగా దివ్య భావ స్వరూపిణియైన రాధ తన అలౌకిక శక్తితో ఆమెకు అఖండ పారవశ్యాన్ని కలిగించింది. వెంటనే యశోద తన గోపాలుణ్ణి చూసింది. అప్పుడామె రాధను యిలా వేడుకొంది "అమ్మా రాధా! నేను కళ్ళు మూసుకున్నప్పుడల్లా నా ముద్దు గోపాలుణ్ణి కాంచగలిగేట్లు వరం యివ్వు".

– శ్రీ రామకృష్ణ పరమహంస

# శ్రీబాబూజీతో అనుభవాలు

బి. లక్ష్మీ కామేశ్వర్

## నిర్హేతుక దయానిలయుడు శ్రీబాబు

1966లో మాకు పాప పుట్టింది. పది నెలల వయస్సుదాకా తాగిన పాలన్నీ తాగినట్లు కక్కేది. పిల్ల బాగా నీరసించిపోయింది. జ్వరం, ఆయాసం, యిలా తరచుగా అనారోగ్యంతో బాధపడేది. మేము ఎంత మంది డాక్టర్లను మార్చినా దానికి పాలు యిమిడేవి కాదు. మా ప్రక్కనే ఉన్న నర్స్ ఒకామె "మిల్క్ ఆఫ్ మాగ్నిసియా ఇవ్వండి. విరోచనమై, ఆకలి పుట్టి తాగిన పాలు యిమడతాయి" అని చెప్పింది. నేను అది యిచ్చేటప్పటికి అది ఒంటికి పడక ఒకరోజు చాలా సీరియస్ అయింది.

అప్పుడు నేను పాపను బాబు దగ్గరకు తీసుకువెడితే నయం అవుతుందేమోనని అనిపించి, శ్రీబాబు ఫొటో దగ్గరకు వెళ్ళి, "బాబూ! నా పెద్ద బిడ్డను రక్షించినట్లుగా దీన్ని కూడా రక్షించండి. మీరు తప్ప మాకు యింక ఎవరు దిక్కు?" అని మనసులో బాధ పడి, మా అమ్మకు గుంటూరుకు ఉత్తరం వ్రాశాను. పిల్ల అనారోగ్యం గురించి, శ్రీబాబుకు తెలియజేసి, ఆయన కనుక మమ్మల్ని రమ్మనమంటే వస్తామని, ఏ విషయం నాకు తిరిగి ఉత్తరం రాయమనీ అందులో వ్రాశాను.

ఉత్తరం అందిన వెంటనే మా అమ్మ, ఆ మధ్యాహ్నమే మా అబ్బాయిని కూడా వెంటబెట్టుకుని, శ్రీబాబుకి యీ విషయం చెబుదామని శ్రీబాబు సన్నిధికి వెళ్ళింది. శ్రీబాబు తీర్థాలు యిస్తున్నారు. మా అమ్మ తీర్థం తీసుకుని, మిగతావిషయాలు అన్నీ శ్రీబాబుతో మాట్లాడి, యీ అసలు విషయం మాత్రం మరచిపోయి, సెలవు తీసుకుని వెనక్కి తిరిగి వస్తుంటే, గుమ్మం దగ్గరకు రాగానే, శ్రీబాబు "ఏమ్మా! తాడేపల్లి గూడెంలో అమ్మాయి, పిల్లలు కులాసాగా ఉన్నారా?" అని ప్రశ్నించారు.

అప్పుడు అమ్మ కంగారుగా "బాబూ! అసలు విషయం మరచాను. అమ్మాయి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది....." అంటూ చెప్పింది. అది విని శ్రీబాబు "అదేనమ్మా! మీరు చెబుతారని ఆగాను. మీరు మరచి పోయినా, వీడు మరవడు కదా!" అంటూ, అన్ని వివరాలు అడిగి తెలుసుకుని, 'యిక్కడకు రావద్దు. రాజమండ్రిలో అనాస ఆదినారాయణ

అనే వైద్యుడి దగ్గరకు తీసుకెళ్ళి, నేను పంపించానని చెప్పి, ఆయన ఏం చెబితే అలా చేయమను. మందులు అయ్యాక నాకు చెప్పమను. పాపకు వచ్చిన భయం ఏమీ లేదు. నేను ఉన్నాను. మీ పిల్లలకు ధైర్యం చెబుతూ ఉత్తరం వ్రాయండి" అన్నారు.

వెంటనే మా అమ్మ అన్నివివరాలతో నాకు ఉత్తరం వ్రాసింది. అది చదివిన వెంటనే మేము రాజమండ్రి తీసుకెళ్దామన్నా, నెలాఖరు రోజులు కనుక డబ్బు యిబ్బంది కలిగింది. బాబు వెంటనే తీసుకెళ్ళ మన్నారు యిప్పుడెలా? అని తర్జన భర్జన పడుతూ, బాబూ! మీరే దారి చూపాలి అని రెండు మూడురోజులు గడిపాము.

ఒకరోజు మావారి స్నేహితుడు రామారావుగారని ఒకరు "నేను అర్జెంటుగా ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఒక వారం రోజుల దాకా రాను. నా రూమ్‌లో డబ్బు అట్టేపెట్టటం అంత మంచిది కాదు. ఈ సొమ్ము మీ దగ్గరే దాచండి" అని చెప్పి, యిచ్చి వెళ్ళిపోయారు. అది చూసి మేము బాబే యిలా మార్గం చూపించారు మనకు. ఇది తీసుకుని వెళ్ళి, ఆయనకు తరువాత తిరిగి యివ్వచ్చు అనుకొని వెంటనే ఆ సొమ్ముతో రాజమండ్రీ బయలుదేరి వెళ్ళాము.

అక్కడికి వెళ్ళాక ఆ వాతావరణం చూసి, మనసులో 'ఇదేమిటి? పెద్ద పెద్ద డాక్టర్ల వలన కానిది, ఈ మామూలు డాక్టరు వల్ల అవుతుందా?' అనుకుంటూ, లోపలికి వెళ్ళాము. పిల్లని చూడగానే, ఆ డాక్టరు "ఈ పిల్లకు జబ్బు బాగా ముదిరింది. గోదావరిలో పారేయక పోయారా?" అన్నారు. అది విని మేము చాలా బాధ పడ్డాము.

"శ్రీ బాబు పంపితే మీ వద్దకు వచ్చాము" అని ఆయనకు బాబు చెప్పినవన్నీ చెప్పాము. వెంటనే "బాబు పంపాడా! అయితే నేను మందు యిస్తే అది తప్పక పట్టు యిస్తుంది. రోగం నయం అయ్యాక నాకేమిస్తావు?" అని మావారిని అడిగారు. మావారు సమాధానంగా "మీరేమి అడిగితే అదే యిస్తాను" అన్నారు. అప్పుడాయన "నాకు ఒక జత గ్లాస్కో పంచెలు ఇవ్వు. మందు తీసుకెళ్ళండి. సుస్తీ ఎక్కువైనా మందు మటుకు ఆపవద్దు. ఏమీ భయం లేదు. అన్నీ ఆ బాబే చూసుకుంటాడు!" అని ధైర్యం చెప్పి, మాకు మందిచ్చి పంపించారు.

ఆ తరువాత పాపకి ఎంత ఎక్కువైనా కూడా మేము ఎవరికీ చూపకుండా, అలాగే ఐదువారాలు, అదే మందు వాడుతూ బాబుని

స్మరిస్తూ గడిపాము. చివరకు మందు పూర్తి అయ్యాక, శ్రీబాబుకు తెలియ జేస్తే, "ఇప్పుడు కొత్త కుండ పిడతలో దంపుడు బియ్యం పోసి, అన్నం వండి, చారు, మజ్జిగ వేసి పెట్టండి చాలు" అన్నారు. అలా వాడాక ఐదు ఆరు నెలలలో పాపకు వాంతులు తగ్గి, బరువు పెరిగి, ఆరోగ్యంగా ఉంది. ఇప్పుడు ఆ పాప పెద్దదై, వివాహమై భర్త పిల్లలతో ఆస్ట్రేలియాలో ఉంటోంది.

భవరోగ వైద్యులైన శ్రీబాబు ఆయుర్వేద ధన్వంతరి కూడా. ఎంతమంది డాక్టర్లకు అంతుబట్టని రోగాన్ని నయం చేసి, మాకు శాంతినీ, ఆనందాన్నీ ప్రసాదించిన ప్రసాదదేవుడు కాళీప్రసాదుడు!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, శ్రీమతి జిల్లెళ్ళమూడి శకుంతలా దేవి (రిటైర్డ్ మేజిస్ట్రేట్‌రామ్మోహనరావుగారి ధర్మపత్ని) 1-11-13 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84సంవత్సరాలు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ బాల భక్తురాలు, కొండ లీల (కొండ రాజా శివానంద్‌గారి మనుమరాలు, కొండ ప్రభాకర్ రాజు కుమార్తె)21-10-13 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందినది. పాప వయస్సు 6 సంవత్సరాలు. శ్రీసద్గురుదేవులు పాప ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# నేను అర్థం చేసుకున్న 'బుద్ధి'

– కొండ వెంకటరాజు

ఆధ్యాత్మిక బాటలో నడిచే భక్తులందరికీ "మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము" అనే నాలుగు ప్రవృత్తుల గురించి తెలిసే వుంటుంది. వీటిలో విశేషించి 'బుద్ధి' గురించి నాకు తెలిసినంత వరకూ యిక్కడ వివరిస్తున్నాను.

మానవుడు బుద్ధిని ఏ విధంగా పదును పెట్టుకోగలరు? అనేది ఒక ప్రశ్న. భగవంతుడు మానవజాతికి మాత్రమే యిచ్చిన యీ విశిష్ఠ గుణాన్ని గురించి పూర్తిగా విస్మరించి నష్టపోతున్నది. ఈ బుద్ధికి మనం ఎంత జాగ్రత్తగా పదును పెడితే అంత బాగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారిని యిది భగవంతుడి వద్దకు చేర్చగలదు అని గురువులు అందరూ ఏకకంఠంతో శెలవిస్తున్నారు.

మనం ఊహ తెలిసిన దగ్గర నుంచే పదును పెట్టటం అలవాటు చేసుకోవాలి. చనిపోయే వరకు కూడా యీ అవసరం ఉంటుంది. భగవంతునికి ఎల్లలు లేనట్లే, యీ బుద్ధికి సానపెట్టడానికి ఎల్లలు లేవు. అంటే బుద్ధికి అనంతమైన జ్ఞానాన్ని యిముడ్చుకోగల శక్తి ఉన్నదన్నమాట. మానవ జన్మను సార్థకం చేసుకోవటానికి యీ శ్రేష్ఠమైన బుద్ధి ఒక్కటి చాలు.

ఇప్పుడు మనం కొద్దిగా మనస్సు గురించి తెలుసుకోవలసి వుంటుంది. మహాత్ములు మనస్సు ఎంత చంచలమైనదో తెలుపుతున్నారు. అనేక రకాల విధ్వంసకరమైన ఆలోచనలతో మనస్సు అల్లకల్లోలంగా వుంటుంది. మంచేదో, చెడేదో కూడా విశ్లేషణ చేసుకోలేదు. ప్రాపంచిక విషయాలలో మునిగితేలుతూ ఉంటుంది. నియంత్రణ లేని మనస్సు ఒక అగ్నిగుండం లాంటిది. ఆ గుండంలో ఎన్ని కట్టెలు వేసినా వాటిని కాల్చేసి యింకా కావాలంటుంది. దీనిని కట్టడి చేయటానికి భగవంతుడు మనకు బుద్ధినిచ్చాడు. దీన్ని ఎలా సానపెట్టాలి? అనే విషయం మీద దృష్టి పెట్టాలి.

దీనికి ఒకటే మార్గం గోచరిస్తోంది నాకు. మన మనస్సు మనల్ని ఏ పని చేయమని ప్రోత్సహిస్తున్నా, మన బుద్ధితో యీ పని చేయవచ్చునా

లేదా? మంచిదా, కాదా? మొదలైన ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టాలి. మనస్సు సంతృప్తి చెందితే, అప్పుడు ఆ విషయాన్ని చిత్తంలో రికార్డు చేసి, ఆచరణలో పెట్టాలి. అలా మనస్సు నుండి చెడు ఆలోచనలని, చెడు గుణాలని వడగట్టగలం. ఇలా జీవితాంతం చేయగలిగితే, బుద్ధి ఒక స్థితి నుండి ఇంకో స్థితికి ఇలా పైపైకి ఎంతో ఎత్తుకి ఎదిగిపోతుంది. పదునెక్కుతుంది. ఆధ్యాత్మిక విషయాలకి యిది ఎంతో అవసరం.

ఒక మహా బుద్ధిమంతుడు న్యూటన్ అనే సైంటిస్ట్ యాపిల్ పండు క్రిందకే ఎందుకు పడుతుంది? అనే ప్రశ్నవేసుకుని, గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ ఎలా తిరుగుతున్నాయి? ఇన్ని నక్షత్రాలు ఆకాశంలో శూన్యంలో ఎలా ఉన్నాయి? అనే బ్రహ్మ సూత్రాన్ని మానవాళికి తెలిపాడు.

బుద్ధిహీనుడికి తాను బుద్ధిహీనుడనని కూడా అర్థం అవదు. ఆలోచన, పరిశీలన, ప్రశ్నలు అనే ప్రాసెస్ ఉండితీరాలి. అది ప్రతి నిముషం ప్రతివిషయానికి జరుగుతూనే ఉండాలి. అప్పుడే బుద్ధి మెరుస్తూ వుంటుంది. మనస్సు చలిస్తున్నంత కాలం, బుద్ధికి పదును పెడుతూనే ఉండాలి. మనస్సు నిలిస్తే బుద్ధితో సహా ఏ యింద్రియానికీ పని వుండదు. సంకల్పం ఒక్కటి కూడా మనస్సులో మిగలకుండా పోతే, మాయను జయించినట్లే. అప్పుడే బ్రహ్మస్థితిని పొందినట్లు.

శ్రీబాబు సీరియస్‌గా ఉపన్యాసం చెబుతూ మధ్య మధ్యలో "ఎనీ క్వశ్చన్స్?" అనో లేక "నో క్వశ్చన్స్, నో ఆన్సర్స్" అని అంటూ ఉండేవారు. శ్రీవారు అలా మనకు తెలియకుండానే మన బుద్ధికి పదును పెడుతూ ఉండేవారు.

సద్బుద్ధి మనకి ఏ విధంగా ప్రపంచంలో ఉపయోగంలోకి వస్తుందో ఈ క్రింది కథ ద్వారా తెలుసుకుందాం. మద్రాస్ నగరంలోని హైకోర్టులో ఒక కేసు జరిగింది. సెంటర్‌లో ఉన్న ఒక సద్బుద్ధిగలవాని స్థలం మీద, ఒక దుర్బుద్ధి గలవాడి దృష్టి పడింది. ఈ దుర్బుద్ధి మంచి అంగబలం, కండబలం, ధనబలం, రాజకీయబలం కలవాడు. తనకు సరిపడా దొంగ కాగితాలన్నీ సృష్టించాడు. సర్కారు వారందరినీ కొనేసి, క్రిందకోర్టులో సద్బుద్ధిని సునాయాసంగా మట్టికరిపించాడు. కేసు హైకోర్టుకి వెళ్ళింది. దుర్బుద్ధి ఒక మంచి గోల్డ్‌మెడలిస్ట్, చాలా అనుభవం గల ప్లీడర్‌ను పెట్టుకున్నాడు.

పాపం! ఈ సద్బుద్ధి బడుగుజీవి. ఇతను ఒక మామూలు వయసు మీరిన, తక్కువ ఫీజుతీసుకునే ప్లీడర్‌ని పెట్టుకున్నాడు. కాని యీ ప్లీడర్‌కు ఒక విశేష గుణం ఉంది. ఎప్పుడూ తన బుద్ధికి పదును పెడుతూ ఉండేవాడు. కేసు కోర్టులో చాలా నెలలు కొనసాగింది.

దుర్బుద్ధి తాలుకు ప్లీడరు చాల బ్రహ్మాండంగా వాదనలు చేశాడు. కోర్టులో అందరూ జడ్జిగారితో సహా కేసు పూర్తి అయిపోయింది అని అనుకుంటున్నారు. సద్బుద్ధి తాలుకు వాదనలు కొన్ని నిలబడినా, అవి చాల తొందరగానే వీగిపోతున్నాయి. అతనికి అశాంతిగా ఉంది అనిపిస్తోంది. ఎక్కడో ఏదో కీలకం ఉంది అని మనసుకి తోస్తోంది కాని అదేమిటో అవగాహనలోకి రావటం లేదు. ఆయన బుద్ధి అన్ని నెలల నుండీ శాంతంగా అంతరంగంలో కేసుని పరిశీలిస్తూనే ఉంది.

మరునాడే జడ్జిమెంట్. ఆ రోజు రాత్రి కేసు గురించి చివరి సారిగా పూర్వాపరాల క్రమం విచారణ చేస్తుంటే, కీలక చిక్కుముడి విడి, కేసు దూదిపింజరంలా విడిపోయింది.

మరునాడు కోర్టు మొదలైంది. దుర్బుద్ధి ప్లీడరు తన వాదన సమాప్తం చేశాడు. సద్బుద్ధి ప్లీడరు, దుర్బుద్ధి కోర్టులో యిచ్చిన ఆస్తి తాలుకు రిజిస్ట్రేషన్ కాగితాలు అన్నీ అడిగి తీసుకున్నాడు. ఒక కాగితాన్ని ఎండపడేటట్లు ఎదురుగా పెట్టి, రెండో ప్రక్క నుండి జడ్జిగారిని చూడమన్నాడు. ఆ కాగితంలో ఒక ఏనుగు వాటర్‌మార్క్ కనబడింది. వాటర్‌మార్క్ అనేది 1932సంవత్సరం తరువాతనే మానవాళికి అందింది. అంతకుముందు ఆ వాటర్‌మార్క్ అందుబాటులో లేదు.

ఆస్తి 1930సంవత్సరం లోనిది. 1932 సం॥లో పేపరుమీద టైప్ చేసి, రిజిస్టర్ చేయించబడింది. 1932సం॥ పేపరు 1930లో ఎలా దొరుకుతుంది? కాబట్టి ఫోర్జరీ చేయబడింది అని అందరికీ అర్థం అయింది.

జడ్జిగారు సద్బుద్ధి తరపున తీర్పునిచ్చారు. దుర్బుద్ధి ఫోర్జరీ కేసులో యిరుక్కున్నాడు. బాహ్య చదువులు చదివిన గోల్డ్‌మెడలిస్ట్, చాల అనుభవం కలిగిన లాయర్ ఓడిపోయాడు. స్వగతంగా బుద్ధికి ట్రయినింగ్ యిచ్చుకున్న వాడు గెలిచాడు. శ్రీసద్గురుదేవులు మనకు అందరికీ అట్టి సద్బుద్ధిని ప్రసాదించుగాక!!

# శ్రీగురుదేవుల ప్రణాళిక

- జగం

గురుశక్తి అపారమైనది. గురుశక్తికి ఏదీ కూడా అసంభవం కాదు. సద్గురుదేవులు శ్రీ బాబూజీ నోటి వెంట ఏవాక్కు వచ్చినా, అదినూటికి నూరుపాళ్ళు అసంభవం అని మానవ మెదడుకు అనిపించేది అయినా సరే. జరిగి తీరవలసినదే. అలా జరిగిన సంఘటనలు, అనుభవాలు కోకొల్లలు! ఉధృతంగా ఉన్న గోదావరిలో మునిగిపోతున్న భక్తులు రక్షింపబడటం సామాన్యమా?

తెల్లజుట్టు నల్లబడటం యాదృచ్ఛికమా! కరెంటులేని తీగల ద్వారా భక్తులకు'షాక్' కొట్టడమేమిటి? ప్రమాదాలలో ప్రాణాలు పోవలసినవారు గురు ఆశీర్వాదంతో చిన్న చిన్న దెబ్బలు తగిలి, ప్రాణాలతో బయటపడ్డ వారు అనేకం. వారి సూచనలు పాటించిన వారికి ప్రమాదాలు తప్పాయి. వారి మాటలు ఆజ్ఞగా పాటించిన వ్యాపారులకు అమితమైన లాభాలు, సంతానం లేనివారికి సంతాన ప్రాప్తి, రోగాలు మటు మాయం, వ్యవసాయంలో ఎక్కువ రాబడులు, ఉద్యోగ ప్రాప్తి ... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో... ఎన్నెన్నో! గురుదేవులు సిద్ధి పొందిన తరువాత సశరీరులుగా దర్శనమీయడం కడు చిత్రం కదా! కలను నిజం చేయడం ఇంకా చిత్రమే. గురుదేవులు సర్వవ్యాపియై, నిరాకారులుగా విలసిల్లుతున్నారు. వారు ప్రత్యక్షంగా లేకపోయినా, వారి ఆశీర్వాదంతో కూడా అనేక చిత్రాలు జరిగాయి, జరుగుతున్నాయి, జరుగుతాయి. అటువంటి చిత్రాలలో ఒకటి ఈక్రిందిది;

గుంటూరులో 26-01-2012 నుండి 30-01-2012 వరకు 'పాంచాహ్నిక శ్రీసద్గురు మహాసౌరయాగం' గురుకృపతో అమిత ఘనంగా జరిగింది. 27-01-2012 నుండి 29-01-2012 వరకు (3రోజులు) సాధుసమ్మేళనం జరిగింది. ఈసమ్మేళనంలో అనేకమంది మహాత్ములు పాల్గొని, తమ అమృతబోధలను భక్తులకు అందించారు.

ఇంతమంది మహాత్ములు పాల్గొంటున్న కార్యక్రమంలో మహాత్ములను స్వాగతిస్తూ ఒక స్వాగత గీతం ఉంటే బాగుంటుందని అనిపించింది. కోరగా శ్రీమతి జమ్మి సుశీల మనోజ్ఞమైన ఒక గీతం రచించారు. మనోజ్ఞమైన గీతాన్ని అంత మధురంగానూ, శ్రావ్యంగానూ పాడి, శ్రోతలను అలరింపచేయాలి. పెద్దవారు కాకుండా పిల్లలు పాడితే బాగుంటుంది కదా. ఆశ్రమవాసి కుమారి బులుసు కాళీమానసను అడుగగా, 'పాడుతాను అంకుల్' అన్నది. ఒకరు పాడటం కంటే, బాగా

'ప్రాక్టీసు' చేసి, ఇద్దరు పాడటం అయితే బాగుంటుంది అనిపించింది. కాని, ఇద్దరు కలిసి పాడి రక్తి కట్టించడం చాలా కష్టం. బాగా కష్ట పడిన తరువాత. ఆశించిన ఫలితం వస్తే అందరికీ చాలా ఆనందం కదా! ఆ రెండో అమ్మాయి ఎవరు? 'ఎవరా' అని నేను ఏమీ ఆలోచించలేదు. ' బాబు ఎవరిని సూచిస్తారో చూద్దాం' అనుకున్నాను.

ఒక రోజున ఉదయం నేను శ్రీకాళీగార్డెన్స్‌లో ఆశ్రమ ఆసుపత్రికి బయలు దేరాను. నాగేంద్రుడి గుడి వద్దకు వెళ్ళాను. శ్రీమతి చుండూరు అన్నపూర్ణమ్మగారి మనుమరాలు (పెద్దకుమారుడు శ్రీ రత్నాకర్ గారి కూతురు) కుమారి వాసవి ఎదురయింది. నేను ముందుకువెళ్ళి పోయాను. ఆమె కూడా ముందుకు కదిలింది. అన్నపూర్ణమ్మగారి మనుమరాలు అని మాత్రమే నాకు తెలుసు, కు॥ వాసవి గురించిన మిగిలిన వివరాలు ఏమీనాకు తెలియదు. ముందుకు వెళుతున్నవాడిని నేను అకస్మాత్తుగా, అనాలోచితంగా ఆగాను. వెనక్కి తిరిగి, వాసవిని పిలిచాను. దగ్గరకు వచ్చి, " ఏంటి అంకుల్", అని అడిగింది. " నువ్వు పాటలు పాడతావా", అని అడిగాను."పాడతాను అంకుల్ స్కూలు కార్య క్రమాలలో కూడా పాడాను", అన్నది వాసవి. "సరే తరువాత చెపుతానులే," అని నేను హాస్పిటల్‌కు వెళ్ళిపోయాను. మనస్సులో బాబుకు కృతజ్ఞతలు సమర్పించుకున్నాను దారి చూపినందుకు. వారు చూపిన దారిని అనుజ్ఞగా గ్రహించాను.

ఆ సాయింత్రం కు॥ మానసను, కు॥ వాసవిని పిలిచి., 3రోజుల సత్సంగ కార్యక్రమంలో మొదటి రోజు 27-01-2012న జరిగే మొదటి సభలో స్వాగత గీతం పాడాలి అని నేను చెప్పడం, వారిద్దరూ సంతోషంగా అంగీకరించడం జరిగింది. ఇద్దరి గొంతులు బాగున్నాయి, కలిసాయి. వారిద్దరూ ఎంతో కష్టపడి, బాగా సాధన చేశారు. కార్యక్రమంలో సుస్వరాలతో, లయబద్ధంగా పాడి, మహాత్ములను అలరింప చేశారు, ప్రేక్షకులను రంజింప చేశారు.

కు॥ వాసవి పాడుతుంది, అని ముందుగా నాకు లేశమాత్రంగా నైనా తెలియదు. అటువంటిది, ఆ రోజు పుట్టదగ్గర నేను అనాలోచితంగా ఆగడం, వాసవిని వెనక్కి పిలిచి అడగడం.... ఇదంతా ఎలా జరిగింది? గురుదేవుల ప్రణాళిక! వారి కృప !! సద్గురు మహిమ!!!

'శివుని ఆజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు, అంటారు. అలాగే, భక్తుల విషయాలలో గురుదేవుల సంకల్పం, ప్రణాళిక ఉన్నాయి. ఇదంతా గురు పరమాత్ముని లీల ! తెలియవే ఓ మనసా !!

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

– విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

గురువుగారు ఒక రోజున బెజవాడలో శ్రీరామానంద విద్యాపీఠంలో జరిగే సత్సంగ సమావేశానికి వెళ్ళారు. అక్కడ పరశురామయ్యగారి శిష్యులైన శ్రీగూడూరి సుబ్రహ్మణ్య శాస్త్రి (బళ్ళారి శాస్త్రి)గారి వద్ద ఇందిర ప్రస్తావన వచ్చింది. శ్రీ శాస్త్రిగారు శ్రీబాబును గురించి తమకు తెలుసునని, వారు సర్వ సమర్థులని, పరమ దయామయులని, వారి వలన ఇందిరకు వ్యాధి నయమవుతుందని, వారి వద్దకు వెళ్ళమని గురువుగారిని ప్రోత్సహించారు. "ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోండి. శ్రీ బాబు సర్వజ్ఞులు, వారికి మన మనస్సులోని భావాలన్నీ తెలుస్తూ ఉంటాయి. వారి దగ్గర మనస్సు దాచకండి" అని హెచ్చరించారు. ఆ తరువాత శాస్త్రిగారు, శ్రీ బాబు గుంటూరులో మాజేటి పున్నయ్య గారింట్లో ఉన్నారని తెలిసి వారితో ఇందిర విషయం మాట్లాడి, గురువుగారికి ఫోనులో చెప్పారు.



వెంటనే హనుమాయమ్మగారు గుంటూరు వెళ్ళి పున్నయ్య గారింట్లో శ్రీ బాబును దర్శించారు. శ్రీబాబు కాళీ ఉపాసకులని ఆమె విని ఉన్నారు. దానికి అనుగుణంగా ఆమె మనస్సులో శ్రీ బాబును గూర్చి ఊహా చిత్రాన్ని నిర్మించుకున్నారు, కాని శ్రీ బాబు ఆ ఊహా చిత్రానికి పూర్తిగా భిన్నంగా ఒక సాదా సీదా యువకునిగా, యాసగాను, నంగిగానూ మాట్లాడుతూ, చదువుకోని వారి వలె కనిపించారు. అందువలన ఆమెకు శ్రీ బాబు యెడల పెద్దగా గౌరవ భావం ఏర్పడ లేదు, నమస్కరించటానికి మనస్కరించకపోయినా, మర్యాద కోసం లాంఛనంగా నమస్కరించారు.

శ్రీ బాబు "మీరు బాగా చదువుకున్న వారు, పండితులు, నేనేమీ చదువుకోని వాడిని, మరి మీరు నాకు నమస్కారం చేయవచ్చునో, చేయ కూడదో! చేసేస్తున్నారు " అన్నారు. హనుమాయమ్మగారు మాట

సర్దుకుంటూ, " మీరు భగవత్స్వరూపులు కనుక చేస్తున్నా" అన్నారు. శ్రీ బాబు నవ్వుకున్నారు. వెంటనే గురువుగారికి 'మనస్సు దాచకండి ' అని చెప్పిన బళ్ళారి శాస్త్రి గారి మాటల్లోని యదార్థం అవగతమైనది. కొంచెం జాగ్రత్తగా ఉండాలని నిశ్చయించుకున్నారు.

''మాచెల్లెలికి మీరే నయం చేయాలండీ'' అన్నారు హనుమాయమ్మ గారు. " అబ్బే ! నేను అంత వాణ్ణి కాదండీ ! ఇంకా పెద్ద ఉపాసకులను ఎవరినైనా వెతుక్కోండి" అన్నారు శ్రీ బాబు. "లేదండీ! మీరే మాకు దిక్కు" అని హనుమాయమ్మగారు అంటే, " సరే రేపు మీ చెల్లెలిని తీసుకు రండి." అన్నారు.

ఇందిరను పట్టిన గ్రహం తెలివైనది. మరునాడు ఇందిర చాపా, చెంబూ పెట్టుకుని మూల కూర్చుంది. చేసేదేమీ లేక గురువుగారొక్కరే వెళ్ళారు. శ్రీ బాబు " ప్రయత్నం చేస్తాను, కాని నేను ఎక్కడ ఉంటే, ఎక్కడికి రమ్మంటే అక్కడికి రావాలి" అన్నారు. గురువుగారు ఒప్పుకున్నారు.

రాజమండ్రిలో 1961లో సంవత్సరాదినాడు ప్రారంభమైన శ్రీ కాళీ జయంతులకు గురువుగారు ఇందిరను రాజమండ్రి తీసుకుని వెళ్ళారు. వాళ్ళకు ప్రత్యేక బస ఇచ్చారు. వంట సామాను పట్టుకుని వెళ్ళినా, గురువుగారు బంతిలోనే భోజనం చేశారు. కొంచెం ఎబ్బెట్టు అనిపించినా సర్దుకున్నారు.

తమ పూజగదిలో శ్రీ బాబు స్వయంగానే అలంకారం చేసుకునేవారు. చాలా మనోహరంగా ఉండేది, ఆ అలంకారం చూసి గురువుగారు " ఈయన సగుణోపాసకులా? నిర్గుణోపాసకులా? ఈ అలంకారం తమ తృప్తికోసమా? భక్తుల ఆనందం కోసమా?" అని తమలో అనుకున్నారు. ఆ రాత్రి ఉపన్యాసంలో శ్రీ బాబు "దీప కాంతి దీపం కంటె వేరుగా లేనట్లే, జ్ఞాని దృష్టిలో నిర్గుణమూ, సగుణమూ అని రెండు లేవు. అవి సగుణ నిర్గుణాతీతమైన ఒకే తత్త్వము యొుక్క భిన్న అభివ్యక్తీకరణాలు. రూపాయి ఒకటే. నూరు పైసలు, నాలుగు పావలాలు, రెండు అర్థరూపాయిలు, యివన్నీ దాని సగుణ రూపాలు, జ్ఞాని సగుణ నిర్గుణాతీతుడు. అయినా లోక కళ్యాణార్థము నామ రూప దేశ కాల క్రియా వివరాలతో కనిపిస్తాడు. అతడు కాలిన తాడు వంటి వాడు. కాలిన తాడు, తాడువలె కనిపిస్తుంది గాని అది దేనినీ బంధించ లేదు. అలాగే జ్ఞాని కర్మలు చేస్తున్నా, ఆ కర్మ ఫలితాలు ఏవీ అతనికి అంటవు. కాని లోక కళ్యాణార్థం అతడు కర్మలు చేస్తాడు.

-సశేషం

(గతసంచిక తరువాయి)

# విష్ణు  కథలు

–రమణ ప్రసాద్

## శ్రీరమణ మహర్షి

శ్రీరమణుని సమత్వాన్ని హర్షించనివారు ఉండరు. తమకు ఏ మాత్రం ప్రత్యేకత చూపటం సహించరు. ఆయనే “నేను ఎప్పుడూ, చివరిలో మొదటి వాడిని అనే వారు.

శ్రీరమణులు తమిళం, ఆంధ్ర మళయాళ, సంస్కృత భాషలలో గ్రంథాలు వ్రాశారు. శ్రీరమణ బోధ. ఏ ప్రత్యేక దర్శనానికీ, ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతములకు చెందినది కాదు. శ్రీరమణుడు స్వానుభవం నుంచే బోధించారు. ఈ బోధ ఆకాశ గంగ వలే స్వచ్ఛమైనది.



శ్రీరమణుని ముఖ్యభోధలివి :-

1)భగవంతునకు శరణాగతి చెందు. ఆయనే ముక్తిని అనుగ్రహిస్తాడు, లేదా,

2) నేనెవడను? అంటే - చూపుతో నిరంతరం నేను మొక్కవుట్టుక స్థానాన్ని వెదకి ఆత్మను తెలుసుకో

ఈ రెండు సాధన తారతమ్యాలను నిష్ఠలను శ్రీరమణ భగవాన్ ఇలా వర్ణించారు.

శరణాగతికి గొప్ప అర్హత కావాలి. ఒక తరగతి వారు భగవంతుడు ఉన్నాడు. ఆయనే జగత్పాలకుడు. ఆయనను శరణాగతి చెందితే ముక్తిని అనుగ్రహిస్తాడు. ఇలా బోధించేవారు ఉత్తమశ్రేణివారు.

రెండవ తరగతివారు ఈ సత్యాన్ని గ్రహించక ‘భగవంతుడు వున్నాడని మీకెలా తెలుసు? ఎట్లా ఉన్నాడు? ఎక్కడ ఉన్నాడు?’ అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తారు. అట్టి వారిని తృప్తి పరచటం అసాధ్యం అందుకే వారిని సూటిగా “ఈ అడిగేది ఎవరు?” అని ప్రశ్నిస్తాను “నేను” అని జవాబు వస్తుంది. “ఆ నేను ఎవరో తెలుసుకోండి” అని అంటాను.

దేవుడు లేడు అనవచ్చు కాని తను లేని అన లేడు కదా! "నేను" నిత్య ప్రత్యక్షం. "నేనెవరిని?" అని నిరంతరం ప్రశ్నిస్తే నేనుకు మూలమైన ఆత్మలోకి సులభంగా చేరుకోవచ్చు.

పై వివరణను బట్టి శ్రీ రమణుని ముఖ్యమైన బోధ శరణాగతి. ఇది శ్రీ రమణుని బోధ. మంత్రానికి 'శక్తి' అని గ్రహిస్తాం.

"నేనెవడను?" అనేది విచారణా పద్ధతి. అత్యంత తర్కయుక్త మైనది. శ్రీరమణులు ఇంకా ఇలా స్పష్ట పరుస్తున్నారు.

నీ శరీరంలో రొమ్ముకు కుడివైపున ఆత్మ స్థానమైన ఆధ్యాత్మిక హృదయం ఉంది. ఇది యోగశాస్త్రంచెప్పే అనాహత చక్రం కాదు. "నేను అను ప్రథమ తలపు" లేక మిథ్యా నేను (జీవుడు) పుడుతోంది. దీనిని ఆశ్రయించి సమస్త తలపుల అనుభవాలు కలుగుతున్నాయి. సాధకుడు ఏకాగ్ర మైన బుద్ధితో, లోచూపుతో 'నేను' ను పట్టుకొని, "నేను" యొక్క పుట్టుక స్థానాన్ని అన్వేషించాలి. అప్పడు ఈ మిధ్య నేను పడిపోయి ఆత్మ స్వరూపంగా అనుభూత ముద్రిత మవుతుంది. ఇదే, శ్రీరమణుని విచారణామార్గం. నా మార్గం ప్రత్యక్షమైనది అని శ్రీరమణుడు పలుకుతున్నారు.

శ్రీరమణుడు భక్తులకు ఆధ్యాత్మిక సుఖాన్నే కాక, ఇహలోక సుఖాన్ని కూడా ఇస్తారు.

శ్రీరమణ స్మరణ సర్వశుభాలకు మూలమైన బాట ఇందులోని రహస్యాన్ని శ్రీరమణులు విప్పారు.

భక్తుల పిలుపు జ్ఞాని హృదయానికి సోకగానే వారి హృదయంలోని కల్పవృక్షం, కామధేనువు, చింతామణులు, స్వయం సంచరితమైన మహా వేగంతో వచ్చి మిమ్ము ఉద్ధరిస్తాయి. రక్షిస్తాయి.

శ్రీరమణుని ఎడమ భుజంపై చిన్న పుండు పొటమరించి పెరిగి పెరిగి రాచపుండై దేహాన్ని కబళించివేసింది.

విచార వదనులైన భక్తులను చూసి కరుణతో తన నిజ స్వరూపాన్ని శ్రీరమణులు తెలియజేశారు.

"ఈ శరీరం నేను కాదని ఎంత చెప్పినా వినక శరీర వికారాలన్ని నాకు అంటకడుతున్నారు. శరీరం ఉండుగాక! పోవుగాక! నేను ఎల్లప్పడూ వుంటాను.

అనుగ్రహ స్వరూపులైన శ్రీరమణులు 1950, ఏప్రిల్ 14 రాత్రి గం. 8-47ని॥ లకు దేహాన్ని చాలించారు.

శ్రీరమణులు దేహాన్ని వదిలిన సమయంలో ఆకాశాన గొప్ప ధవళ తేజస్సు కాంతులను చిమ్ముతూ ఈశాన్య దిక్కులో అంతర్లీనమైంది. ఈ జ్యోతి అన్ని దేశాలలోను కనబడింది. ఈశాన్యదిక్కు శివలోకం. శ్రీరమణుడు కుమారస్వామి కనుక మానుష వేషం వీడి కాంతి దేహుడై స్వలోకం చేరారు.

ఒక బైరాగి పూరీ జగన్నాధ దేవాలయాన్ని దర్శించాడు. భగవంతుడు సాకారుడా, నిరాకారుడా అని అతనికి సందేహం. జగన్నాధుడి దివ్య విగ్రహాన్ని పరీక్షించి అతడు తన సంశయాన్ని నివృత్తి చేసుకోవాలనుకున్నాడు. అప్పుడతను తన దండాన్ని ఎడమవైపు నుంచి కుడివైపుకు పోనిచ్చి, విగ్రహాన్ని తాకుతుందేమో అని చూశాడు. కొంతసేపు అతడికేమీ గోచరించ లేదు. దండంతో దేన్నీ తాకలేకపోయాడు. దానితో భగవంతుడు నిరాకారుడని నిశ్చయించుకున్నాడు. కాని మళ్ళా కుడి నుంచి ఎడమవైపుకు దండాన్ని పోనిచ్చి చూడగానే అది విగ్రహాన్ని తాకింది. అప్పుడు అతడుభగవంతుడు సాకారుడు, నిరాకారుడు కూడా అని నిశ్చయించుకున్నాడు.

– శ్రీ రామకృష్ణ పరమహంస

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL